Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక



సంపుటి : 19 సంచిక : 188 05 - 03 - 2026 పేజీలు : 12

## రాష్ట్రంలో 25 వేల మంది
# బోగస్ ఉద్యోగులు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నకిలీ ఉద్యోగులను సృష్టించిన ఏజెన్సీలపై ఆడిట్ చేసి కేసులు పెట్టాలని ఆదేశం
- మార్చి 6 నుంచి 99 రోజుల పాటు 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం
- ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై కఠినంగా లేకుంటే కలెక్టర్లపై చర్యలని హెచ్చరిక
- రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఉన్న 1.70 లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఈ నకిలీ ఉద్యోగులను గుర్తించినట్లు తెలిపారు
- బోగస్ ఉద్యోగులను సృష్టించి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై ఆడిట్ చేయించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



**, హైదరాబాద్, మార్చి 04 :** రాష్ట్రంలో సుమారు 25 వేల మంది బోగస్ ఉద్యోగులు ఉన్నారని, వారంతా కనీసం ఆధార్ కార్డు కూడా లేకుండా ఏళ్లుగా జీతాలు తీసుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి సంచలన విషయం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఉన్న 1.70 లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఈ నకిలీ ఉద్యోగులను గుర్తించినట్లు తెలిపారు. ఇలాంటి బోగస్ ఉద్యోగులను సృష్టించి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై - మిగతా 2 లో

## డిజిటల్ జనగణనకు
# తెలంగాణ సిద్ధం

- మే 11 నుంచి తొలి దశ
- తెలంగాణలో జనగణన తొలి దశకు రంగం సిద్ధం
- మే 11 నుంచి జూన్ 9 వరకు ఇళ్ల వివరాల సేకరణ
- దేశంలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ విధానంలో లెక్కింపు
- సొంతంగా వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్
- ఏ ఒక్క ఇల్లు వదలకుండా పక్కాగా లెక్కించాలని అధికారులకు ఆదేశాలు

**హైదరాబాద్, మార్చి 04 :** దేశవ్యాప్తంగా జరగనున్న జాతీయ జనాభా గణన (జనగణన) ప్రక్రియలో భాగంగా తెలంగాణలో తొలి దశ పనులను పకడ్బందీగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు, ఇతర కట్టడాల వివరాలను నమోదు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, అన్ని శాఖల కార్యదర్శులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, కీలక మార్గదర్శకాలు జారీ చేశారు.

- మిగతా 2 లో

## ఇవి మనిషి సృష్టించిన
# తీవ్ర విషాదాలు




- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఇరాన్‌లోని పాఠశాలపై మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మృతి
- తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్
- ఈ యుద్ధాలు రాబోయే తరాలకు తీరని శోకాన్ని మిగిలిస్తాయని వ్యాఖ్య




## అమెరికా వద్ద
## క్షిపణి నిల్వలు తగ్గిపోతున్నాయా!

- పెంటగాన్ నివేదిక లీక్
- దాడులు మరో 10 రోజులు కొనసాగితే కీలక క్షిపణుల నిల్వలు తగ్గిపోవచ్చని హెచ్చరిక
- ఇంటర్ సెప్టర్ క్షిపణులు, గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ల నిల్వలు గణనీయంగా తగ్గినట్లు వెల్లడి
- ఆయుధ సంపత్తిని తిరిగి పెంచుకునేందుకు అధిక ఖర్చులు భరించాల్సి ఉంటుందన్న నివేదిక

## గల్ఫ్‌లో ఉద్రిక్తతల మధ్య భారతీయుల
# తరలింపునకు 58 ప్రత్యేక విమానాలు

- మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారతీయుల తరలింపు
- 58 ప్రత్యేక విమానాలను నడుపుతున్న ఇండియన్ క్యారియర్లు
- ఇండిగో 30, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ 23 ఫ్లైట్స్ ఏర్పాటు
- టికెట్ ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్న పౌర విమానయాన శాఖ
- నిర్ధారణ లేకుండా ఎయిర్‌పోర్టులకు రావొద్దని ప్రయాణికులకు సూచన



మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తరలించేందుకు భారత విమానయాన సంస్థలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. ఇవాళ ఒక్కరోజే 58 ప్రత్యేక విమానాలను నడుపుతున్నట్లు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇందులో ఇండిగో 30 విమానాలను, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కలిసి 23 విమానాలను నడపనున్నాయి.పశ్చిమాసియాలోని చాలా దేశాలు తమ గగనతలాన్ని మూసివేయడం లేదా కఠిన ఆంక్షలు విధించడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు - మిగతా 2 లో

## వచ్చే ఎన్నికల్లో 70కి పైగా సీట్లు కావాలి
## 21 ఇస్తే ఒప్పుకోం


- జనసేన నేత కిరణ్ రాయల్
- వచ్చే ఎన్నికల్లో 70కి పైగా స్థానాల్లో పోటీ చేయడం ఖాయమని జనసేన నేత కిరణ్ రాయల్ వెల్లడి
- 21 సీట్లతో సరిపెట్టుకునే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- పవన్ కల్యాణ్ లేకుంటే కూటమి అధికారంలోకి వచ్చేది కాదని వ్యాఖ్య






## 3 నెలల్లో యుద్ధప్రాతిపదికన
# వర్సిటీల్లో పోస్టుల భర్తీ

- రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- వర్సిటీల్లో 3,371 ఖాళీ పోస్టులకు 3 నెలల్లో యుద్ధప్రాతిపదికన భర్తీ
- పాఠశాల విద్యాశాఖ, ఉన్నత విద్యాశాఖ బడ్జెట్ డిమాండ్లపై అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి నారా లోకేశ్
- 2019-24 మధ్య విద్యాశాఖలో తీవ్ర విధ్వంసం
- 10 లక్షల మంది విద్యార్థులు బడులకు దూరమయ్యారని వెల్లడి
- విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్న మంత్రి లోకేశ్
- ఈ ఏడాది బడ్జెట్లో నాడు-నేడుకు రూ.1200 కోట్లు కేటాయించామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు




విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అలానే ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రపంచానికి చూపిస్తామని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ బడ్జెట్ రూ.32,308 కోట్లు, ఉన్నత విద్యాశాఖ రూ.2,566 కోట్ల బడ్జెట్ డిమాండ్లపై మంత్రి అసెంబ్లీలో మాట్లాడారు. 2019-24 మధ్య విద్యాశాఖలో తీవ్ర విధ్వంసం జరిగిందని, 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారని మండిపడ్డారు. అన్ని సబ్జెక్టుల్లోనూ విద్యార్థుల్లో ప్రమాణాలు దారుణంగా పడిపోయాయని, అక్షరాస్యత విషయంలో ఏపీని అట్టడుగు స్థానానికి చేర్చారని దుయ్యబట్టారు.ఐబీ, సీబీఎస్ఈ సిలబస్, - మిగతా 2 లో

ది క్రైమ్ న్యూస్ తెలుగు దినపత్రిక

గురువారం 5 - 03 - 2026

# 3 నెలల్లో యుద్ధప్రాతిపదికన వర్సిటీల్లో పోస్టుల భర్తీ



**మొదటిపేజీ తరువాయి** – టోఫెల్ పేరుతో ప్రకటనలు, ప్రచారం తప్ప ఒక్క పనీ సరిగా చేయలేదని మంత్రి లోకేశ్ అన్నారు. నాడు-నేడు పేరుతో ప్రచార అర్భాటం తప్ప పనులు జరగలేదని విమర్శించారు. ఈ ఏడాది బడ్జెట్లో రూ.1200 కోట్లు కేటాయించామని వెల్లడించారు. ఏపీలో 100 శాతం అక్షరాస్యత సాధించేలా ప్రత్యేక ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. విద్యార్థులను యాక్టివ్ లెర్నర్లుగా మార్చేందుకు క్లిక్కర్ టెక్నాలజీ తెచ్చామని 300కు పైగా పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టును త్వరలో రాష్ట్రమంతా అమలు చేస్తామని చెప్పారు. లీప్ యాప్ ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పిల్లల్ని అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. స్కూల్ కిట్లు, చిక్కీలు, గుడ్ల సరఫరాలో అవినీతి నివారించి రూ.1000 కోట్లు ఆదా చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ చెప్పారు.జీతభత్యాలు, సౌకర్యాలు ఏమీ లేకుండా నైతిక విలువలు పెంచటం బాధ్యతగా తీసుకున్న చాగంటి కోటేశ్వరరావుని సభాముఖంగా అభినందించారు. మా సొంత పిల్లలకు ఏం చేస్తామో అందరు పిల్లలకు అలాంటి సౌకర్యాలు ఉండాలని భావిస్తున్నట్లు స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ హయాంలో యూనివర్సిటీలను రాజకీయ కేంద్రాలుగా మార్చటం, తమ బంధువుల్ని వీసీలుగా రిజిస్ట్రార్లుగా నియమించటం ద్వారా ఉన్నత విద్యారంగాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. తన కుమారుడు దేవాన్ష్‌ను బ్రాహ్మణి ఫోన్‌కు దూరంగా ఉంచి పుస్తకాలు చదవటం అలవాటు చేసిందని అన్నారు. అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు కోసం శోభా రియాల్టీ వారు రూ.100 కోట్లు సీఎస్సార్ నిధులు సెంట్రల్ లైబ్రరికి ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, సుందరపు విజయ్ కుమార్ విద్యారంగంపై మాట్లాడారు.3 నెలల్లో యుద్ధప్రాతిపదికన భర్తీ: విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వచ్చే 3 నెలల్లో యుద్ధప్రాతిపదికన భర్తీ చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో 3,371 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటి భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఉన్నత న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించి 3 నెలల్లో అవసరమున్న ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల సంఖ్య, ఆయా ఖాళీలను ఎప్పటిలోగా పూర్తి చేస్తారని మండలిలో సభ్యుడు బొర్రా గోపిమూర్తి అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఖాళీల భర్తీకి 2018, 2023లో నోటిఫికేషన్ ఇచ్చారని వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ పాటించకపోవడంతో 2023 నోటిఫికేషన్‌ను కోర్టు తప్పుబట్టినందున సదరు ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. ఇప్పటికే మేం ఏజీతో 3 సార్లు సమావేశమై పూర్తిస్థాయిలో చర్చించామని నూతన నోటిఫికేషన్ ఇవ్వాలని మేం నిర్ణయం తీసుకున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు.

# రాష్ట్రంలో 25 వేల మంది బోగస్ ఉద్యోగులు



**మొదటిపేజీ తరువాయి** – సమగ్ర ఆడిట్ చేయించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆయన తీవ్రంగా ఆదేశించారు. కలెక్టర్లు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని అమలు చేయడంపై ఆయన దిశానిర్దేశం చేశారు. గ్రామ సర్పంచులు, మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల భాగస్వామ్యంతో ఈ ప్రణాళికను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఈ నెల 12న జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నోడల్ అధికారిగా నియమించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు, హెచ్చరికలు జారీ చేశారు. ధాన్యం సేకరణలో మోసాలకు పాల్పడే మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని, వారి నుంచి ధాన్యాన్ని వెనక్కి రాబట్టాల్సిన పూర్తి బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలెక్టర్లు, ఎస్పీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భూభారతి దరఖాస్తులను గడువులోగా పరిష్క రించాలని, ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, దానికి సంబంధించిన కార్యక్రమాలను ఒక వేడుక వాతావరణంలో జరపాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# వచ్చే ఎన్నికల్లో 70కి పైగా సీట్లు కావాలి, 21 ఇస్తే ఒప్పుకోం



**మొదటిపేజీ తరువాయి** – ఏపీ రాజకీయాల్లో జనసేన తిరుపతి నియోజకవర్గ ఇంఛార్జి కిరణ్ రాయల్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 70కి పైగా స్థానాల్లో పోటీ చేయడం ఖాయమని, కేవలం 21 సీట్లు ఇస్తామంటే అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 ఎన్నికలతో పోలిస్తే జనసేన పార్టీ బలం గణనీయంగా పెరిగిందని, భవిష్యత్తులో సీట్ల సర్దుబాటులో ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన పరోక్షంగా మిత్రపక్షాలకు సూచించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వల్లే ఏపీలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిందని కిరణ్ రాయల్ అన్నారు. “పవన్ కల్యాణ్ లేకపోతే టీడీపీ ఎన్నికల బరిలో నిలబడటమే కష్టమయ్యేది. ఈ విషయంలో టీడీపీ నేతలకు నేను సవాల్ విసురుతున్నా“ అని వ్యాఖ్యానించారు. రాజమండ్రి జైలులో చంద్రబాబు ఉన్నప్పుడు టీడీపీ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో ఉంటే, పవన్ ముందుకొచ్చి కూటమి ఏర్పాటు చేసి వారికి ధైర్యం ఇచ్చారని గుర్తుచేశారు. ఆ క్లిష్ట సమయంలో పవన్ చూపిన చొరవ వల్లే కూటమి విజయం సాధించిందని, ప్రజలు పవన్ కల్యాణ్‌ను నమ్మి ఓట్లు వేశారని అభిప్రాయపడ్డారు.గత ఎన్నికల్లో తాను పోటీ చేయకపోవడానికి గల కారణాలను కూడా కిరణ్ రాయల్ వివరించారు. రాజకీయాల్లో ప్రజాబలంతో పాటు ఆర్థిక బలం కూడా అవసరమని, ఆ సమయంలో ఆర్థికంగా బలంగా లేకపోవడం వల్లే పోటీకి దూరంగా ఉన్నానని తెలిపారు. తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్, హరిప్రసాద్‌తో తనకు విభేదాలు ఉన్నాయనే ప్రచారాన్ని ఆయన ఖండించారు. తామంతా పవన్ నాయకత్వంలో జనసేన పార్టీ బలోపేతం కోసమే పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా పోటీ చేశాయి. జనసేన పోటీ చేసిన 21 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాల్లోనూ 100 శాతం స్ట్రైక్ రేట్‌తో చారిత్రక విజయం సాధించింది. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# డిజిటల్ జనగణనకు తెలంగాణ సిద్ధం


**మొదటిపేజీ తరువాయి** – **దేశంలోనే తొలిసారి డిజిటల్ లెక్కింపు**

ఈసారి జనగణన ప్రక్రియలో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకోనుంది. దేశ చరిత్రలోనే మొదటిసారి జనాభా లెక్కలను పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నేరుగా స్మార్ట్‌ఫోన్లలో వివరాలను నమోదు చేస్తారు. ఇది సమాచార సేకరణలో వేగాన్ని, కచ్చితత్వాన్ని పెంచుతుంది. అంతేకాకుండా, పౌరులు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునేందుకు “సెల్ఫ్-ఎన్యూమరేషన్“ పేరిట ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు. ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మే 11కి 15 రోజుల ముందు నుంచే ప్రారంభమవుతుందని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు.

**పక్కాగా వివరాలు నమోదు చేయాలి: సీఎస్**

క్షేత్రస్థాయిలో వివరాల సేకరణలో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని సీఎస్ స్పష్టంగా ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం భౌగోళిక సరిహద్దులను కచ్చితంగా నిర్ధారించుకోవాలని సూచించారు. మారుమూల గిరిజన తండాలు, పట్టణాల్లోని మురికివాడలతో సహా రాష్ట్రంలోని ఏ ఒక్క కట్టడాన్ని కూడా వదిలిపెట్టకుండా జాబితాలో చేర్చాలని ఆయన స్పష్టం చేశారు. ఈ బృహత్కార్యక్రమం విజయవంతం కావడానికి గణకులు, పర్యవేక్షకులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జనాభా లెక్కల విభాగం రాష్ట్ర సంచాలకురాలు భారతీ హోళికెరి, డేటా సేకరణ కోసం రూపొందించిన మొబైల్ యాప్ పనితీరు, సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రతి ఒక్కరి బాధ్యతలను ఆమె విశదీకరించారు. ఈ డిజిటల్ విధానం వల్ల సమాచార సేకరణలో పారదర్శకత పెరగడంతో పాటు, భవిష్యత్ ప్రభుత్వ పథకాల రూపకల్పనకు కచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# గల్ఫ్‌లో ఉద్రిక్తతల మధ్య భారతీయుల తరలింపునకు 58 ప్రత్యేక విమానాలు



**మొదటిపేజీ తరువాయి** – పడుతున్నారు. ఈ సంక్షోభ పరిస్థితుల్లో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నారు. ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ వంటి సంస్థలు దుబాయ్, ఫుజైరా వంటి నగరాల నుంచి ఈ ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నాయి. ఈ విమానాలు న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, కొచ్చి, అహ్మదాబాద్, తిరువనంతపురం విమానాశ్రయాలకు చేరుకోనున్నాయి.ప్రస్తుతం దుబాయ్ గగనతలం పాక్షికంగా మాత్రమే తెరిచి ఉంది. పరిమిత సంఖ్యలో విమానాలకు అనుమతినిస్తున్నారు. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థ నుంచి నిర్ధారిత బయలుదేరే సమయం గురించి సమాచారం అందిన తర్వాతే విమానాశ్రయానికి రావాలని అధికారులు ప్రయాణికులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. అప్పటివరకు దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం లేదా అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లవద్దని కోరారు. మరోవైపు అబుధాబి నుంచి తమ కార్యకలాపాలను గురువారం (మార్చి 5వ తేదీ) మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ఎతిహాద్ ఎయిర్‌వేస్ ప్రకటించింది.ప్రయాణికుల భద్రతే తమకు అత్యంత ముఖ్యమని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రిఫండ్‌లు, రీషెడ్యూలింగ్, ఇతర సహాయక చర్యల విషయంలో ప్రయాణికులతో పారదర్శకంగా వ్యవహరించాలని అన్ని విమానయాన సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్లిష్ట సమయంలో విమాన టికెట్ల ధరలు అదుపు తప్పకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రయాణికులపై అనవసర భారం పడకుండా చూస్తామని మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చింది.

# అమెరికా వద్ద క్షిపణి నిల్వలు తగ్గిపోతున్నాయా!



**మొదటిపేజీ తరువాయి** – అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం రోజురోజుకూ ముదురుతోంది. యుద్ధం కొనసాగుతున్న ఈ పరిస్థితుల్లో పెంటగాన్ నుంచి వచ్చిన హెచ్చరిక చర్చనీయాంశంగా మారింది. అమెరికా వద్ద రోజురోజుకూ క్షిపణి నిల్వలు తగ్గిపోతున్నట్లు పెంటగాన్ నివేదిక లీక్ అయింది. మరో 10 రోజులు ఇలాగే దాడులు కొనసాగిస్తే కీలకమైన క్షిపణుల నిల్వలు తగ్గిపోవచ్చని ఈ నివేదిక హెచ్చరించింది. ముఖ్యంగా ఇంటర్ సెప్టర్ క్షిపణులు, గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ల నిల్వలు గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను ఎదుర్కోవడంలో ప్రస్తుతం ఇవి కీలక పాత్రను పోషిస్తున్నాయి. ఈ క్రమంలో పది రోజులు దాడులు కొనసాగితే పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందని నివేదికలు చెబుతున్నాయి. ఆయుధ, క్షిపణి సంపత్తిని తిరిగి పెంచుకునేందుకు అధిక ఖర్చులు భరించాల్సి ఉంటుందని ఈ నివేదిక పేర్కొంది. కీలకమైన ఆయుధాల కొరత వల్ల ఇరాన్ దాడులను తిప్పికొట్టడం అసాధ్యంగా మారే అవకాశం ఉందని హెచ్చరించింది. గత కొన్నేళ్లుగా మిత్రదేశాలైన ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌లకు ఆయుధ సంపత్తిని అందిస్తుండటంతో నిల్వలు తగ్గిపోతున్నట్లు తెలిపింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటన మాత్రం మరోలా ఉంది. తమ వద్ద లెక్కలేనన్ని ఆయుధాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇరాన్ తో పోరాడటానికి కావాల్సిన ఆయుధాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అత్యాధునిక ఆయుధాలను ఇతర దేశాల్లోనూ నిల్వ చేశామని వెల్లడించారు. ఇరాన్‌పై దాడులు మరో ఐదు వారాలు లేదా అంతకంటే ఎక్కువగా కొనసాగవచ్చునని తెలిపారు.

ది క్రైమ్ న్యూస్ తెలుగు దినపత్రిక

# చెప్పకనే చెబుతున్నా..



ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని హతం చేశామని ఇటు అమెరికా అటు ఇజ్రాయెల్ ఏకకంఠంతో ధృవీకరించినా, భారత ప్రధాని నరేంద్రమోదీ నోరువిప్పకపోవడం సముచితం కాదని కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మౌనం తటస్థం కాదు, తప్పించుకోవడం అంటున్నారామె. భారత విదేశాంగ విధానం లక్ష్యాలు, ఆశయాల మీద అనుమానాలు కలుగుతున్నాయని, దాని విశ్వసనీయత దెబ్బతింటున్నదని హెచ్చరించారు ఆమె. ఖమేనీ హత్యను ప్రశ్నించకుండా, ఇరాన్ సార్వభౌమత్వ ఉల్లంఘనను ఖండించకుండా మోదీ ప్రభుత్వం మౌనం పాటించడం అసలు సంఘటనల కంటే ఎక్కువ దిగ్భ్రాంతికి గురిచేస్తోందట. పార్లమెంట్ సమావేశాల్లోనైనా ఆయన చేత ఏదో మాట్లాడించాలని ఆమె ఎందుకు అనుకుంటున్నారో తెలియదు కానీ, నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ యుద్ధం విషయంలో అనుసరిస్తున్న విధానం మీద ఎవరికీ ఏ అనుమానాలూ లేవు. ఆయన ఇజ్రాయెల్‌లో ఒకే ఒక్కరోజు కాలూనివచ్చిన కొద్దిగంటల్లోనే ఆరంభమైన ఈ భీకర యుద్ధం గురించి నోరుతెరిచినదానికంటే ఎక్కువగా మౌనంగానే చెప్పేశారు. ఇరాన్ మీద ఇజ్రాయెల్ దాడిచేయగానే తాను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూతో మాట్లాడినట్టు ఓ పోస్టుపెట్టారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగానూ, గల్ఫ్‌దేశాల్లోని అమెరికా స్థావరాల మీదా ఇరాన్ ప్రతీకారదాడులు చేయగానే తాను అరబ్ ఎమిరేట్స్ అధినేతతో ఫోన్‌లో మాట్లాడానని మరో ట్వీట్ చేశారు. ఎమిరేట్స్ అధినేతను బ్రదర్ అని సంబోధిస్తూ, ఆ దేశం మీద జరిగిన దాడులను మోదీ తీవ్రంగా ఖండించారు. రెండు ఫోన్‌కాల్స్, ఇటీవలి రెండు సమావేశాలు మన విధానాన్ని విస్పష్టంగా ప్రకటిస్తున్నాయని మీడియా విశ్లేషిస్తూంటే, ఇంకా మోదీ నోరువిప్పాలని డిమాండ్ చేయడం అనవసరం.యుద్ధం ఇప్పట్లో ఆగదు, ఈ క్షిపణిమోతల తరువాత, బూట్ల చప్పుళ్ళు కూడా వినబడతాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ అధినాయకుడు నెతన్యాహూ ముక్తకంఠంతో తేల్చేశారు. ఇరాక్ మాజీ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను భూగర్భం నుంచి వెలికితీసినప్పుడూ, ఉరితీసినప్పుడూ ఎంతటి అవమానకరమైన, వికారమైన భాష విన్నామో ఇప్పుడూ అదే వినబడుతోంది. ఎనభైనాలుగేళ్ళ వృద్ధుడు, రేపోమాపో దిగిపోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో ఈ హత్య జరిగింది. గతంలో ఇరాన్ ఉన్నతాధికారులను, నేతలను అమెరికా హత్యచేసిన తీరుకూ, ఈ సామూహిక హత్యాకాండకూ ఉన్న తేడా అనేకులకు గుర్తుకువస్తున్నది. వేగంగా ప్రయాణిస్తున్న కారులో సైతం తాము లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తిని మాత్రమే హత్యచేయగలిగే నైపుణ్యం, సమర్థత, అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు ఉండి కూడా, ఈ వృద్ధుడిని సకుటుంబసపరివారంగా హతం చేయడం ద్వారా అమెరికా మిగతా ప్రపంచాన్ని భయపెట్టి, వికటాట్టహాసం చేసింది. రాత్రికి రాత్రి దేశాధినేతలను ఎత్తుకుపోవడమే కాదు, ఎక్కడ దాక్కున్నా అతిభయానకంగా మట్టుబెట్టగల శక్తిసామర్థ్యాలు తమకు ఉన్నాయని ట్రంప్ చాటిచెప్పారు. గిట్టని పాలకుడిని మట్టుబెట్టిన తరువాత కూడా ఇంకా ఈ విధ్వంసం ఎందుకు అని కొందరి అనుమానం. ఖమేనీ స్థానంలోకి ఎందరు వచ్చినా వారూ హతం కావాల్సిందే కానీ, తమ కీలుబొమ్మ కుర్చీ ఎక్కేవరకూ ఈ యుద్ధమూ విధ్వంసమూ ఆగదని దానర్థం. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకొనేందుకు అనాదిగా ఉపయోగిస్తున్న భవనాన్ని అమెరికా యుద్ధవిమానాలు నేలమట్టం చేయడంలో మీ పాలకులు ఎవరో నిర్ణయించేది మేమేనన్న హెచ్చరిక ఉంది. తమ మతపెద్దను అమెరికా హత్యచేయడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న షియాలకు ఆగ్రహాన్ని, ఆవేదనను కలిగించడం సహజం. చాలాచోట్ల నిరసనల్లో సున్నీలు కూడా పాల్గొన్నారని, మొత్తంగా ముస్లిం సమాజం మనసుగాయపడిందనే విశ్లేషణలు వింటున్నాం. ఆగ్రహావేశాలు వేగంగానే ఉపశమించవచ్చును కానీ, గాయం మానడం కష్టం. దీని ప్రభావం ఎన్నిరూపాల్లో ఎన్నివిధాలుగా ఉంటుందో భవిష్యత్తు చెబుతుంది. యుద్ధం కూడా నాలుగువారాల్లో ముగుస్తుందని ట్రంప్ అంటున్నా, ఒకవేళ నిజంగానే అది జరిగినా, రేపిన నిప్పు మాత్రం చల్లారదు. సద్దాం మరణానంతర ఇరాక్ కొత్తరకం ఉగ్రవాదశక్తులను ఎగుమతిచేసిన దుష్ప్రభావాలు ప్రపంచం ఇప్పటికీ చవిచూస్తోంది. గతకాలపు కత్తియుద్ధాల్లో శత్రువు తలతెగితే విజయం సాధించినట్టే. ఇప్పుడూ అదే జరిగినా యుద్ధం సాగుతోంది. రాజు మరణించగానే శత్రుసైన్యాలు దాసోహపడటం, రాజ్యమూ అంతఃపురం సహా సమస్త పరివారం వశం కావడం రాచరికాల్లోనే సాధ్యం.

# రెండు కీలక బిల్లులకు ఆమోదం తెలిపిన ఏపీ శాసనమండలి




**మొదటిపేజీ తరువాయి** – **అసైన్డ్ భూముల సవరణ బిల్లు – 2026**

మంత్రి అనగాని సత్యప్రసాద్ సభలో వివరించిన ప్రకారం, ఈ సవరణ ద్వారా ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములను క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు (సౌర, పవన విద్యుత్ వంటివి) లీజుకు ఇచ్చే అవకాశం లభిస్తుంది. బంజరు లేదా చౌడు భూములుగా ఉండి సాగుకు పనికిరాని అసైన్డ్ భూములకు ఈ లీజు ద్వారా భరోసా లభిస్తుంది. ఎకరాకు ఏడాదికి రూ. 31 వేల లీజు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి రెండేళ్లకు లీజు మొత్తాన్ని 5 శాతం మేర పెంచుతూ చట్టంలో సవరణ చేశారు.అసైనీదారుల పూర్తి అనుమతితోనే భూములు తీసుకుంటారు. ట్రై-పార్టీ అగ్రిమెంట్ (త్రిపక్ష ఒప్పందం) ద్వారా లబ్ధిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తారు. ఈ చట్టంతో రాష్ట్రంలో సుమారు రూ. 10 లక్షల కోట్ల విలువైన క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల 7.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

**గ్రామ, వార్డు సచివాలయాల సవరణ బిల్లు –2026**

గ్రామ వార్డు స్థాయి పాలనలో మార్పులు తీసుకువస్తూ ఈ బిల్లును ఆమోదించారు. ప్రస్తుతం ఉన్న గ్రామ, వార్డు సచివాలయాలను ఇకపై 'స్వర్ణ గ్రామం' మరియు 'స్వర్ణ వార్డు' సచివాలయాలుగా పిలుస్తారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం.

# ఇవి మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలు



**మొదటిపేజీ తరువాయి** – ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరుపుతున్న దాడులు తీవ్రరూపం దాల్చాయి. దక్షిణ ఇరాన్‌లోని మినాబ్ పట్టణంలో ఉన్న 'షజ్రే తయ్యెబా' బాలికల ప్రాథమిక పాఠశాలపై జరిగిన మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మరణించారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా విషాదం కలిగించింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాల శిథిలాల కింద చిక్కుకుని మరణించిన ఆ 165 మంది బాలికల సామూహిక అంత్యక్రియలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం వెనుక కారణాలు ఏవైనా, ఇలాంటి మారణహోమాలు మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధాలు రాబోయే తరాలకు కేవలం తీరని శోకాన్ని, వినాశనాన్ని మాత్రమే మిగుల్చు తాయని కేటీఆర్ హెచ్చరించారు.

ది క్రైమ్ న్యూస్ Crime News
తెలుగు దినపత్రిక
గురువారం 05 - 03 - 2026

# 'పులివెందుల వెళ్లేందుకు శివశంకర్‌రెడ్డికి అనుమతి ఇవ్వొద్దు'

**కోర్టుకు సునీత, సీబీఐ విజ్ఞప్తి**

**శివశంకర్‌రెడ్డి పిటిషన్‌పై సీబీఐ, సునీతల అభ్యంతరం**

**బెయిల్ షరతులు సడలించొద్దని హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టుకు విజ్ఞప్తి**

**అక్కడి సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వెల్లడి**



మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఐదో నిందితుడైన డి.శివశంకర్‌రెడ్డిని సొంతూరు పులివెందుల వెళ్లడానికి అనుమతించవద్దని కేంద్ర దర్యాప్తు సంస్థతో పాటు వివేకా కుమార్తె సునీత హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టుకు నివేదించారు. స్థానిక సాక్షులను ఆయన ప్రభావితం చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. 79 ఏళ్ల తల్లి వెన్నునొప్పితో బాధపడుతున్నారని, 2025లో శస్త్రచికిత్స విజయవంతం కాలేదని, అందువల్ల మరోసారి శస్త్రచికిత్స చేయించడానికి నెల రోజులపాటు పులివెందుల వెళ్లడానికి అనుమతిస్తూ బెయిల్ షరతులను సడలించాలని కోరుతూ శివశంకర్‌రెడ్డి హైదరాబాద్ సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌పై సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. పిటీషనర్ వివేకా హత్యకుట్రతో పాటు సాక్ష్యాల చెరిపివేతలో కీలకపాత్ర పోషించారని పేర్కొంది. ఈ కేసులో సాక్షులందరూ ఆ ప్రాంతంలోనే ఉన్నారని, నెలరోజులపాటు పిటీషనర్ అక్కడే ఉంటే వారిని ప్రభావితం చేయగలరని పేర్కొంది. శివశంకర్‌రెడ్డి అక్కడికి వెళ్లడం కంటే ఆయన తల్లిని హైదరాబాద్‌కు తీసుకురావడం వల్ల ఉపయోగం ఉంటుందని, అందువల్ల పిటిషన్‌ను కొట్టేయాలని కోరింది.

**అది వాస్తవం కాదు :** సునీత తరపున ఆమె న్యాయవాది ఎస్.గౌతమ్ కౌంటర్ దాఖలు చేశారు. గత ఏడాది జరిగిన శస్త్రచికిత్స విఫలమైందన్నది వాస్తవం కాదని, దీనికి ఆధారాల్లేకుండా షరతులను సడలించాలని కోరుతున్నారని పేర్కొన్నారు. సాక్షుల రక్షణ కోసమే అక్కడకు వెళ్లరాదన్న షరతు విధించారని గుర్తుచేశారు. శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి, కోడలు ఇద్దరూ డాక్టర్లేనని వాళ్లు కడపలో ఆస్పత్రి నడుపుతున్నారని పేర్కొన్నారు.ప్రత్యేక చికిత్స అవసరమైతే హైదరాబాద్ తీసుకురావచ్చన్నారు. లేదంటే కడపలో వారి కుటుంబ ఆస్పత్రిలో కాకుండా పులివెందులలో చికిత్స అందించడానికి అన్న కారణం చెప్పడంలో అనుమానాలున్నాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాస్తవాలు వెల్లడించకుండా, వైద్య రికార్డులు సమర్పించకుండా బెయిల్ షరతులను సడలించరాదని శివశంకర్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై సీబీఐ కోర్టు విచారణను ఈ నెల ఐదోతేదీకి వాయిదా వేసింది.

**రెండేళ్ల తర్వాత మళ్లీ :** అయితే వివేకానంద రెడ్డి హత్య కేసులో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రెండేళ్ల తర్వాత మళ్లీ సీబీఐ విచారణ ప్రారంభించిన విషయం తెలిసిందే. కిరణ్ యాదవ్‌కి – అర్జున్ రెడ్డికి మధ్య జరిగిన ఫోన్ సంభాషణపై కూడా కూపీ లాగుతున్నారు. పులివెందులలో కిరణ్ యాదవ్, మహేంద్ర యాదవ్‌ను ప్రశ్నించారు. కొందరు వ్యక్తులు తనను చంపాలని కుట్ర చేస్తున్నారని సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో 2 ఏళ్ల తర్వాత సీబీఐ మరోసారి విచారణ చేపట్టింది. ఈ కేసులో నిందితుడు సునీల్ యాదవ్, సాక్షిగా ఉన్న భరత్ కుమార్ యాదవ్ సోదరులు కిరణ్ కుమార్ యాదవ్, మహేంద్ర యాదవ్‌లను పులివెందుల పోలీస్ స్టేషన్‌లో సీబీఐ అధికారులు విచారించారు. విచారణకు తొలుత మహేంద్ర హాజరు అయ్యారు. అనంతరం కిరణ్ వచ్చారు. వివేకా హత్య చోటు చేసుకున్న రోజు తెల్లవారుజామున 1.42 గంటలకు అర్జున్ రెడ్డి అనే వ్యక్తికి కిరణ్ కుమార్ వాట్సప్ కాల్ చేశారు. వీరిద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ పై సీబీఐ అధికారులు ప్రశ్నించారు. అలాగే కిరణ్‌కి మహేంద్రకి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలపై కూడా విచారించారు. కిరణ్ బంధువు కావడంతో గతంలో ఫోన్లో మాట్లాడుకున్నట్లు మహేంద్ర సమాధానం ఇచ్చారు. కిరణ్ తన సోదరుడు సునీల్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. వీరిని 2 గంటల పాటు సీబీఐ అధికారి రోహిత్ యాదవ్ విచారించారు. కాల్ డేటా ఆధారంగా అనుమానితులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు.

# నిప్పు రవ్వతో చెలరేగిన మంటలు

**బాచుపల్లిలో 33 ఫర్నీచర్ షాపులు దగ్ధం**

**హైదరాబాద్ బాచుపల్లిలో నిన్నరాత్రి భారీ అగ్నిప్రమాదం**

**నిజాంపేట్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ నుంచి చెలరేగి ఫర్నీచర్ షాప్‌కు అంటుకున్న మంటలు**

**ఒక్కో ఫర్నీచర్ షాప్‌లో రూ.30 లక్షల వరకు సామగ్రి ఉంటుందన్న నిర్వాహకులు**



హైదరాబాద్ బాచుపల్లిలో మంగళవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నిజాంపేట్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ నుంచి చెలరేగిన ఓ నిప్పు రవ్వ దాదాపు 30కి పైగా కుటుంబాల భవిష్యత్తును బుగ్గిపాలు చేసింది. స్థానికుల కథనం ప్రకారం మొదటగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వ ఏర్పండి అది క్రమంగా మంటగా మారి దగ్గరలోని ఫర్నీచర్ షాప్‌కు అంటుకుంది. అనంతరం పక్కనే ఉన్న మరిన్ని దుకాణాలకు వేగంగా వ్యాపించింది.

**33 ఫర్నీచర్ దుకాణాలకు తీవ్ర నష్టం :** సోఫాలు మండే స్వభావం ఉన్న వస్తువులకు మంటలు అంటుకుని ఇంకా ఎక్కువగా చేలరేగింది. ఈ ప్రమాదం కారణంగా ఏకంగా 33 ఫర్నీచర్ దుకాణాలు కాలిబూడిదయ్యాయి. ఆ ప్రాంతంలో మొత్తం 43 తాత్కాలిక దుకాణాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో పలు ద్విచక్రవాహనాలు, సామగ్రి, డబ్బు, బంగారు ఆభరణాలు అగ్నికి ఆహుతి అయ్యాయి."ఈ అగ్నిప్రమాదంలో ఫర్నీచర్ షాప్స్ కాలిపోయాయి. రోడ్డు పక్కన ఫర్నీచర్ దుకాణాలు పెట్టుకుని తయారు చేస్తుంటారు. షెడ్డు వేసుకుని ఫర్నీచర్ వ్యాపారం చేస్తుంటారు. ప్రమాదం ధాటికి అవి కూడా కూలిపోయాయి. వాటి కింద కూడా కొన్ని మంటలు ఉన్నాయి. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ఎవరికీ గాయాలు కాలేదు. కేవలం ఆస్తి నష్టం జరిగింది. ఈ సమ్మర్‌లో వాళ్లు షాప్స్‌కు మధ్యన కొంత గ్యాప్ మెయింటెన్ చేయాలి. అగ్నిమాపక సాధనాలు కూడా పెట్టుకోవాలి " -శ్రీనివాస్, కూకట్‌పల్లి ఏడీఎఫ్‌వో

**మంటల్లో షాపులను చూసి బోరున విలపించిన నిర్వాహకులు :** ఒక్కో ఫర్నీచర్ షాప్‌లో సుమారు రూ.30 లక్షల విలువైన సామగ్రి ఉంటుందని దుకాణాల నిర్వాహకులు చెబుతున్నారు. సోఫాలు, బెడ్లు, కుర్చీలు, కిటికీలు, తలుపులు, ఇతర కలప వస్తువులు కూడా బాడిదయ్యాయి. కళ్ల ముందే కాలిపోతున్న విలువైన ఆస్తులను కాపాడుకోలేక నిర్వాహకులు బోరున విలపించిన తీరు చూసిన వారిని కంటతడి పెట్టిస్తుంది. మంగళవారం రాత్రి పదిన్నర తర్వాత ఈ ప్రమాదం అకస్మాత్తుగా సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని ఆరు ఫైరింజన్లతో మంటలు అదుపు చేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోడవంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు."స్టార్టింగ్ షాప్ నుంచి మూడో షాప్ దగ్గర కరెంట్ స్తంభం ఉంది. అక్కడి నుంచి నిప్పు రవ్వ పడినట్లు తెలిసింది. నా భార్య చెప్పింది. క్షణాల్లోనే మంటలు మొత్తం వేగంగా వ్యాపించాయి. మొత్తం కాలిపోతుంటే నా భార్య ఏడుస్తూ బయటకు పరుగెత్తింది. మొత్తం 43 షాపుల్లో 33 పూర్తిగా కాలిపోయాయి. వాటిలో ఒక్కో దాంట్లో రూ.30 లక్షల విలువైన సామాగ్రి ఉంటుంది. కొన్ని షాపుల్లో ఇంకా ఎక్కువగా కూడా ఉండే అవకాశం ఉంది" -దుకాణదారుడు"మాకున్నది ఒకటే షాపు. తగలబడిపోతుందని కట్టుబట్టలతో బయటికి వచ్చాం. అన్నీ షాపుల్లో ఎన్ని కాలిపోయాయో ఏమో తెలియదు. కరెంటు వల్లే ఈ ప్రమాదం జరిగింది" -స్థానికురాలు.

# రాజమహేంద్రవరానికి పోలవరం అథారిటీ కార్యాలయం

**కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాలు**

**పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఏర్పాటైన 12 ఏళ్ల తర్వాత రాజమహేంద్రవరం తరలింపునకు ఆదేశాలు**

**ఈనెల 27న పోలవరం ప్రాజెక్టు సందర్శనకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి**



పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఏర్పాటైన పన్నెండు ఏళ్ల తర్వాత రాజమహేంద్రవరానికి తరలించేందుకు ఆదేశాలు వెలువడ్డాయి. హైదరాబాద్‌లో ఉన్న అథారిటీ కార్యాలయాన్ని వెంటనే రాజమహేంద్రవరం మార్చాలని కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జలశక్తి శాఖ డిప్యూటీ కార్యదర్శి బీఎల్. మీనా పోలవరం అథారిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)కి లేఖ రాశారు. చీఫ్ ఇంజినీరు, డిజైన్ డిపార్ట్‌మెంట్‌తో సహా అందరినీ హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి తరలించాలని అందులో పేర్కొన్నారు. ఈ నెల 27న కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావు పోలవరం ప్రాజెక్టు సందర్శించడానికి వస్తున్నారని తెలుస్తూ ఉండగా అప్పటిలోగా తరలించాలని భావిస్తున్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతానికి దగ్గరగా: ప్రస్తుతం రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరులో పోలవరం అథారిటీ కోసం ఓ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఆ భవనానికి రూ.3 లక్షలు అద్దె కూడా చెల్లిస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచే పోలవరం అథారిటీ చీఫ్ ఇంజనీరు రమేశ్ కుమార్ పని చేస్తున్నారు. తాజా ఆదేశాల మేరకు మిగిలిన అన్ని డిపార్ట్మెంట్లు రాజమ హేంద్ర వరం రానున్నాయి. రాజమహేంద్రవరం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతానికి చాలా దగ్గరగా ఉంది. కార్యకలాపాలు నిర్వహించడానికి హైదరాబాద్‌లో ఎక్కడో ఉండవలసిన అవసరం లేదు. అంతేకాకుండా, పోలవరం ప్రాజెక్టు 2వ దశకు సంబంధించిన డీపీఆర్ రూపకల్పన చేయాల్సి ఉంది.

**2వ దశకు డీపీఆర్ సిద్ధం చేయడం కీలకమైన అంశం**

ఈ ప్రాజెక్టును 2 దశలుగా విభజించారు. మొదటి దశలో, +41.15 మీటర్ల ఎత్తుకు నీళ్లు నిలబెట్టేలా నిర్వహించడానికి అవసరమైన నిధులు మాత్రమే సెంట్రల్ గవర్నమెంట్ అందిస్తోంది. ఈ మేరకు వెచ్చించిన నిధులకు తగిన విధంగా ఆయకట్టు కల్పించాల్సి ఉంది. వాటి ద్వరా వ్యయం, ఫలితాలు సంతృప్తి చెందిన తర్వాత, 2వ దశలో +45.72 మీటర్ల వద్ద నీళ్లు నిలబెట్టేలా నిర్వహించడానికి పునరావాసం కోసం నిధులు ఇవ్వాల్సి ఉంది.ఈ 2వ దశకు డీపీఆర్ సిద్ధం చేయడం కీలకమైన అంశం. రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, పోలవరం అథారిటీతో సమన్వయంతో వీటిని రూపొందించాల్సి ఉంది. అదనంగా, కుడి, ఎడమ కాలువల డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువల నిర్మాణం కూడా చాలా ముఖ్యమే. వాటి ప్రణాళికలను కూడా సిద్ధం చేయాల్సి ఉంది. అథారిటీ కార్యాలయం రాజమహేంద్రవరంలో ఉండటం వల్ల ఈ కార్యకలాపాల్లో సమన్వయం కూడా సులభం కానుంది.

**యాజమాన్య బోర్డును ఎప్పుడు తరలిస్తారు?**

కృష్ణా నదీ యాజమాన్య బోర్డును రాష్ట్రానికి తరలించనున్నారు. ఉచిత వసతి కల్పిస్తే విజయవాడకు వస్తామని కృష్ణా బోర్డు చైర్మన్, కార్యదర్శి పేర్కొంటున్నారు. వసతి కోసం అనేక భవనాలను పరిశీలించినప్పటికీ, ఈ సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. ప్రస్తుతం, హైదరాబాద్‌లోని జలసౌధలో ఉచిత వసతితో కృష్ణా బోర్డు కార్యకలాపాలు నిర్వహిస్తోంది.


# చిత్తూరు జిల్లాలో ఘోరం - సిమెంట్ లారీ ఢీకొట్టిన కారు

**బెంగళూరు వాసులు ఐదుగురు మృతి**

**లారీని వెనుకవైపు నుంచి ఢీకొన్న కారు**

**గంగవరం మండలం వైఎస్సార్ జంక్షన్ వద్ద ఘటన**

**బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న కారు**



చిత్తూరు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. గంగవరం మండలం వైఎస్సార్ జంక్షన్ వద్ద జరిగిన ఘటనలో కారులోని ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. మృతులను బెంగళూరుకు చెందిన మోహన్ దాస్(71), నాగరాజరావు(61), కుసుమ(61), జయంతి(59), పూజ(33)గా గుర్తించారు. లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టింది. వేగంగా లారీ కిందికి దూసుకెళ్లిన కారు అక్కడే చిక్కుకుపోయింది. చాలాసేపు శ్రమించి కారుని బయటికి లాగారు. బెంగళూరు రాజాజీ నగర్‌కు చెందిన కుటుంబం తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. చాలాసేపు శ్రమించి కారుని బయటికి లాగారు. ప్రమాదంపై బెంగళూరులోని బంధువులకు సమాచారం అందించారు.

# కమిషన్ వేసే అధికారం ప్రభుత్వానికి ఉంది

**కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టులో సర్కారు**

**ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన ఏజీ సుదర్శన్ రెడ్డి**

**జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటులో ఎలాంటి దురుద్దేశాలు లేవు**

**ముందస్తు ప్రణాళికలు ఏమీ లేవని ప్రభుత్వం స్పష్టీకరణ**




కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన బ్యారేజీల నిర్మాణంతోపాటు మేడిగడ్డ కూలిపోవడానికి సంబంధించి బాధ్యులను గుర్తించడానికి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటులో ఎలాంటి దురుద్దేశాలుగానీ ముందస్తు ప్రణాళికలుగానీ ఏమీ లేవని ప్రభుత్వం హైకోర్టుకు స్పష్టం చేసింది. కమిషన్ అఫ్ ఎంక్వరీస్ చట్టం ప్రకారం కమిషన్ వేసే అధికారం ప్రభుత్వానికి ఉందని ఈ అధికారం కింద జీవో నంబర్ 6ను జారీ చేసినట్లు పేర్కొంది.

**అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు :** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో జరిగిన అవకతవకలపై విచారణ నిమిత్తం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్, హరీశ్ రావు, ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్కే జోషి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ కొనసాగుతోంది. మంగళవారం ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంతోపాటు మేడిగడ్డ కూలిపోవడానికి సంబంధించి బాధ్యులను గుర్తించడానికి జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటులో ఎలాంటి దురుద్దేశాలుగానీ, ముందస్తు ప్రణాళికలుగానీ ఏమీ లేవని ప్రభుత్వం హైకోర్టుకు స్పష్టం చేసింది.

**జీవో నంబర్ 6ను జారీ :** మేడిగడ్డ కుంగిపోయిన నేపథ్యంలో ప్రజాప్రయోజనాల్లో భాగంగానే కమిషన్ నియామకం జరిగిందని తెలిపింది. కమిషన్ అఫ్ ఎంక్వరీస్ చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం కమిషన్ వేసే అధికారం ప్రభుత్వానికి ఉందని ఈ అధికారం కింద జీవో నంబర్ 6ను జారీ చేసినట్లు పేర్కొంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏలేరు కమిషన్ ఏర్పాటును సుప్రీం కోర్టు కూడా సమర్థించిందన్నారు. కమిషన్ ఏర్పాటు విధివిధానాల ప్రకారం నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టిందన్నారు. అందువల్ల ప్రజాప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

**అధిక వడ్డీ భారం ప్రభుత్వంపై :** మేడిగడ్డ కుంగిపోయిన నేపథ్యంలో ఎన్‌డీఎస్‌ఏ పరిశీలించి నివేదిక సమర్పించిందని ఇందులో బ్యారేజీ నిర్మాణంలో సరైన డిజైన్ లేదని నిర్మాణం, నిర్వహణలో లోపాలు, నిర్లక్ష్యం ఉందని నివేదిక ఇచ్చిందని ప్రభుత్వం వాదించింది. కాగ్ నివేదికలతోపాటు ప్రభుత్వ రికార్డుల ఆధారంగానే ప్రజాధనం వృథా, అధికార దుర్వినియోగం జరిగిందని విచారణ నిమిత్తం కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ప్రాణహిత – చేవెళ్ల పథకాన్ని పునరాకృతితో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పెట్టుబడి గిట్టుబాటు కాదని కాగ్ తన నివేదికల్లో వెల్లడించిందని ఏజీ ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌కు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో చెప్పలేదని ప్రభుత్వమే బడ్జెట్ నుంచి కేటాయించాల్సి వస్తోందని, దీని వల్ల వడ్డీ భారం అధికంగా ప్రభుత్వంపై పడుతోందని వెల్లడించిందన్నారు.

**విచారణను వాయిదా వేసిన ధర్మాసనం :** సరైన ప్రణాళిక లేకుండా చేపట్టిన పనుల వల్ల దీర్ఘకాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇది ప్రభావం చూపుతుందని కాగ్ ఆందోళన వ్యక్తం చేసిందని ఏజీ అన్నారు. కాళేశ్వరం నిర్మాణం చేపట్టడంతో అదనంగా 5 వేల 643 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం పెరిగిందని, దీనివల్ల ఏటా కోట్ల రూపాయల విద్యుత్తు ఛార్జీలు పెరిగాయని కోర్టుకు తెలిపారు. సీడబ్ల్యూసీ కి సమర్పించిన రూ. 81 వేల 911.01 కోట్ల ప్రాజెక్టు వ్యయం రూ. 1.47 వేల 427 కోట్లకు పెరిగిందని అంటే ఎకరాకు రూ. 8.12 లక్షల పెట్టుబడి పెట్టినట్లయిందని పేర్కొందన్నారు. పెట్టుబడికి తగ్గ ఆదాయం వ్యవసాయం ద్వారా రావడంలేదని ఏజీ సుదర్శన్ రెడ్డి పేర్కొందన్నారు. విద్యుత్తు వినియోగం కూడా ఎక్కువ కావడంతో ఇది రాష్ట్రంపై అదనపు భారం పడుతుందని కాగ్ తెలిపిందన్నారు. వాదనలు పూర్తి కాకపోవడంతో ధర్మాసనం విచారణను ఈనెల 5కు వాయిదా వేసింది.

# నా కొడుకు పుట్టినరోజుకు కూడా నన్ను దూరం చేశారు: బాల్క సుమన్

**ఆదిలాబాద్ జైలు నుంచి విడుదలైన బాల్క సుమన్**

**తనపై రివర్స్‌లో అక్రమ కేసులు పెట్టారని మండిపాటు**

**కాంగ్రెస్ నేతల కడుపు మంట తగ్గిందని వ్యాఖ్య**



బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మునిసిపల్ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుకు సంబంధించి సుమన్ తో పాటు మరికొందరు నేతలు కూడా జైలు నుంచి బయటకు వచ్చారు. జైలు నుంచి విడుదలైన అనంతరం సుమన్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పోలీసులు తమపై లాఠీచార్జ్ చేయడమే కాకుండా, రివర్స్‌లో అక్రమ కేసులు పెట్టారని ఆయన మండిపడ్డారు. కేవలం 7 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్, మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించారు. జిల్లా అధికారులు ప్రభుత్వ ఉద్యోగుల్లా కాకుండా, మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యక్తిగత సిబ్బందిలా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తాము ఎన్నడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని, తనను జైలులో పెట్టడం ద్వారా అధికార పార్టీ నాయకుల కడుపు మంట తగ్గిందని అన్నారు. హోలీ పండుగ మరియు తన కుమారుడి పుట్టినరోజున కూడా తనను దూరంగా ఉంచారని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు.

# యుద్ధంలోకి జీసస్, అల్లాను లాగిన రామ్ గోపాల్ వర్మ

**అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య యుద్ధంపై వర్మ సెటైరికల్ ట్వీట్**

**ఇది జీసస్ - అల్లా మధ్య జరుగుతున్న యుద్ధం అన్న వర్మ**

**ఎవరు గెలిస్తే తాను ఆ మతంలోకి మారుతానని వ్యాఖ్య**



మధ్యప్రాచ్యంలో ముదురుతున్న యుద్ధ మేఘాలపై వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందించారు. ప్రపంచ దేశాలన్నీ యుద్ధ భయంతో వణికిపోతుంటే, వర్మ మాత్రం ఈ భయానక అంశాన్ని ఒక 'దైవిక పోరాటం'గా అభివర్ణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. అమెరికా, ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య జరుగుతున్న ఈ ఘర్షణను ఆయన కేవలం దేశాల మధ్య యుద్ధంగా కాకుండా, "జీసస్ – అల్లా మధ్య జరుగుతున్న యుద్ధం" అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.నాస్తికుడిగా తనను తాను ప్రకటించుకునే వర్మ, ఈ యుద్ధంలో ఎవరు గెలిస్తే తాను ఆ మతంలోకి మారిపోతానంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. క్లిష్టమైన రాజకీయ పరిణామాలను కూడా తన సెటైరికల్ కోణంలో చూడటం వర్మకు వెన్నతో పెట్టిన విద్య. గతంలోనూ మతపరమైన నమ్మకాలపై ఇలాంటి సెటైర్లు వేసిన ఆయన, ఇప్పుడు అంతర్జాతీయ యుద్ధ వాతావరణాన్ని కూడా వదలకుండా తన మార్క్ పోస్ట్‌తో నెట్టింట చర్చకు తెరలేపారు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

# అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవ సభను జయప్రదం చేయండి

## ◆ పి.ఓ.డబ్ల్యు పోస్టర్ ఆవిష్కరణ




**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 4, (ది క్రైమ్ న్యూస్):-** శ్రామిక మహిళల ఉపాధి పై మోడీ ప్రభుత్వం జరుపుతున్న దాడికి వ్యతిరేకంగా మార్చి 1నుండి 8 వరకు అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాలను గ్రామ గ్రామాన విజయవంతంగా జరపాలని, మార్చి 7 న జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలో జరిగే సభకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ప్రగతిశీల మహిళా సంఘం(పి ఓ డబ్ల్యు) రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కామ్రేడ్ గుజ్జు కృష్ణవేణి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలోని కామ్రేడ్ బట్టు అంజయ్య స్మారక భవనంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం పోస్టర్ ఆవిష్కరణ పి.ఓ.డబ్ల్యు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పి.ఓ.డబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు కామ్రేడ్ గుజ్జు కృష్ణవేణి పాల్గొని మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం శ్రామిక వర్గ మహిళల పై పనిభారాన్ని మోపుతూ, వారి శ్రమను దోచుకునేందుకు అదనపు పని గంటలు పెంచుతూ, కార్పొరేట్లకు ఊడిగం చేసే విధానాలను అమలు చేస్తున్నారని దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్మించాలని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకముకు పేరు మార్చి, రోజులు పెంచి, బడ్జెట్లో కోతలు విధిస్తూ క్రమంగా ఆ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఇది 26 లక్షల కోట్ల ఉపాధి జాబ్ హోల్డర్లకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు, వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు, ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఉపాధి హామీ పథకంలో అత్యధికంగా పని దొరికేది మహిళలకు, దళిత, ఆదివాసి, గిరిజనులకు మాత్రమేనని ఆ పథకం రద్దు చేస్తే ఆ సామాజిక వర్గ ప్రజలు తీవ్రంగా నష్టపోతారని విమర్శించారు. ఈ పథకానికి 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రాలు ఖర్చులు భరించాలని నిర్ణయించడం అంటే దాన్ని క్రమంగా ఎత్తివేసే ఆలోచనేనని అన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకురావడం అశేష కార్మిక వర్గం తో పాటు ముఖ్యంగా మహిళా కార్మిక వర్గానికి హక్కులు కోల్పోతారని, అదనపు పని గంటలు పెంచి భారం మోపుతున్నారని, రాత్రి షిఫ్ట్ లలో కూడా మహిళలు పని చేయాలని చెప్పడమంటే కారు చౌకగా వారి శ్రమను దోచుకోవడమేనని విమర్శించారు. దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం చట్టాలలో మార్పులు చేస్తూ ముఖ్యంగా మహిళ శ్రామిక వర్గంపై భారాలు మోపడానికి పూనుకున్నదని ఈ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని 1 నుండి 8 వరకు గ్రామ గ్రామాన నిర్వహించాలని, 7న జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణ కేంద్రం లో సభ నిర్వహిస్తున్నామని, ఈసభ కు మహిళా లోకం అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు నాయకులు మంద పద్మ సామ రజిత మునిత జ్యోతి అనుష మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబా గాంధీ విద్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

● విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ● నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపల్, స్పెషల్ అధికారినీ పై కలెక్టర్ ఆగ్రహం.. ● పట్టుదల క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి ● అన్ని విద్యాసంస్థలలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలి ● జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్





**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 4(ది క్రైమ్ న్యూస్):-** జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీ, అన్ని విద్యాసంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ లపై క్షేత్రస్థాయిలో పక్కా ప్రణాళికతో ప్రత్యేక అధికారులు సంబంధిత సిబ్బంది ముందుకు సాగాలని, పిల్లలకు అందించే సౌకర్యాలలో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని (కేజీబీవీ) కస్తూరిబా గాంధీ విద్యాలయంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని స్టోర్ గది, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, స్టడీ రూమ్, పరిసరాలను పరిశీలించారు. అనంతరం తరగతి గదులలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలు, డైట్ మెనూ, తరగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న పరీక్షల నేపథ్యంలో షెడ్యూలు ప్రకారం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులకు ఏలాంటి మానసిక ఒత్తిడి లేకుండా వారికి అర్థమయ్యే విధంగా నూతన డిజిటల్ తరగతులు ప్రాక్టికల్స్ ద్వారా విద్యను అందించాలని, పక్కాగా డైట్ మెనూ ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం స్నాక్స్ అందించాలని, తద్వారా పిల్లలు మంచి వాతావరణంలో విద్యను కొనసాగించి ఉత్తమ ఫలితాలు సాధించుటకు ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించి సిలబస్ పూర్తి చేయాలన్నారు. ప్రతి విద్యార్థిని, గమనిస్తూ ఉండాలని, విద్యలో వెనుకబడిన పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. ప్రత్యేక అధికారులు ఇప్పటికే వారికి కేటాయించిన విద్యా సంస్థలలో తనిఖీలు నిర్వహించి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించడం జరుగుతుందని, ప్రతిరోజు ఉదయం సాయంత్రం వసతిగృహాలు, విద్యా సంస్థల నివేదికలు సమర్పించాలని సూచించారు. కేజీబీవీ పాఠశాలలో పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలలో నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపల్, స్పెషల్ అధికారినీ సోమలక్ష్మిని పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని, లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, స్థానిక తహసిల్దార్ వివేక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## బాలికలు ఉన్నత విద్య ను అభ్యసించి అన్ని రంగాలల్లో రాణించాలి: తహసిల్దార్ ధీరజ్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఓదెల మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో బుధవారంనాడు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థినిలకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ధీరజ్ మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి వివరిస్తూ బాలికలు ఉన్నత విద్య ను అభ్యసించి అన్ని రంగాలల్లో రాణించాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ జి. కవిత , జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ, జెండర్ స్పెషలిస్ట్ జె. సుచరిత చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ బి. ఉమాదేవి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం అకౌంటెంట్ ఎం. సమత, క్యాడర్ ఎన్జీవో సిబ్బంది, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయినిలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జాతీయ కుటుంబ ప్రయోజనం పథకం (చీఖీదీ) నో అర్హులైన వారు పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఓ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం లేదా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. బి.పి.ఎల్ కుటుంబాలలో కుటుంబాన్ని పోషించే ప్రధాన వ్యక్తి 18 నుంచి 60 సంవత్సరాల వయసు గలవారు మరణిస్తే వారు కుటుంబానికి ఈ పథకం కింద 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. ఈ పథకానికి సంబంధించి మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇతర ఆర్థిక సహాయాలు అందకుండా ఉండాలని , అప్పుడే ఈ పథకం అమలు అవుతుందని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

## పేరు మార్పిడి/స్పష్టీకరణ ప్రకటన



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** ఇందు మూలంగా తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న నా భర్త ఉప్పుల నారాయణ గారి పెన్షన్ రికార్డులలో నామినీగా నా పేరు అంజమ్మ గా నమోదు చేయబడినది. నా పేరు ఇప్పటివరకు ఆధార్ కార్డులో ఉప్పుల అంజలిగా నమోదు అయి ఉన్నది. వాస్తవానికి అంజలి మరియు అంజమ్మ అనే పేర్లు రెండు ఒకే వ్యక్తికి చెందినవని ఇందుమూలంగా స్పష్టికరించు చున్నాను. అందుచేత నా ఆధార్ కార్డు లోని పేరును అంజలి నుండి అంజమ్మ గా మార్చుటకు ఈ ప్రకటన జారీ చేయబడినది.

**ప్రకటన దారు..ఉప్పుల అంజమ్మ /అంజలి, భర్త : నారాయణ, గ్రామం: గూడెం, మండలం: ఓదెల, జిల్లా: పెద్దపల్లి, తెలంగాణ రాష్ట్రం.**

## ఎన్.హెచ్.ఆర్.సి.ఐ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్గా జంగపల్లి యశ్వంత్ బాధ్యతల స్వీకరణ




**మంథని, మార్చి 4, (ది క్రైమ్ న్యూస్):** (ఎన్.హెచ్.ఆర్.సి.ఐ) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్గా జంగపల్లి యశ్వంత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం రోజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన జాతీయ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో మానవ హక్కుల పరిరక్షణకు, సామాన్యులకు అండగా నిలవడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బాధిత వర్గాలకు న్యాయం జరిగేలా చూడటం. మానవ హక్కుల ఉల్లంఘనలపై ఎప్పటికప్పుడు స్పందించడం. ప్రజల్లో హక్కుల పట్ల అవగాహన కల్పించడం.

## లిటిల్ మాస్టర్స్ స్కూల్లో ఘనంగా హోలీ సంబరాలు



**మంథని, మార్చి 4, (ది క్రైమ్ న్యూస్):** లిటిల్ మాస్టర్స్ పాఠశాలలో హోలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, విద్యార్థినులు పరస్పరం రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు. పాఠశాల ప్రాంగణం రంగుల సందడితో కళకళలాడగా చిన్నారులు ఉల్లాసంగా పాల్గొని హోలీ సంబరాలను మరింత ఉత్సాహంగా మార్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ జంగిలి మల్లేష్ మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలు కూడా హోలీ రంగుల్లా ఆనందంగా, విజయాలతో నిండాలని ఆకాంక్షించారు. మనలో ఉన్న అహంకారాన్ని విడిచిపెట్టి పరస్పర ప్రేమ, స్నేహభావంతో జీవించాలనే సందేశాన్ని హోలీ పండుగ అందిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. పండుగల ద్వారా ఐక్యత, ఆనందం, స్నేహం పెంపొందుతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. హోలీ సంబరాలు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

## నూతన సిఐగా పి.శ్రీలత భాధ్యతల స్వీకరణ



**మానకొండూర్, మార్చి 4(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నూతన సిఐగా పి.శ్రీలత బుధవారం మధ్యాహ్నం భాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సిఐల బదిల్లో ఇక్కడ పనిచేసిన బోలిమాల సంజీవ్ కరీంనగర్ ట్రాఫిక్ -1కు బదిలీ కాగా ఆయన స్థానంలో శ్రీలత నియమితులయ్యారు. భాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీలత మాట్లాడుతూ... నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నేర నిరోధక చర్యలు, మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి,ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఇందుకై పోలీసులకు పూర్తిగా సహకరించాలని ప్రజలను సిఐ కోరారు.

## పోస్టాపీసులో పోస్టల్ ఇన్స్పెక్టర్ల విచారణ



**రామగిరి, మార్చి04(ది క్రైమ్ న్యూస్):-** సెంటినరీ కాలనీ పోస్టాపీసులో బుదవారం పోస్టల్ ఇన్స్పెక్టర్లు విచారణ జరిపారు. గతంలో బేగంపేట, సెంటినరీ కాలనీ పోస్టాపీసు లో డిపాజిట్లు, ప్రతి నెల పొదుపు డబ్బులు కిసాన్ వికాస్ పత్రం (కెవిపి), సుకన్య పథకం కింద డబ్బులు జమా కాలేదు. దీనిపై అప్పట్లో దుమారం లేచింది. సెంటినరీ కాలనీ-బేగంపేట కలుపుకొని సుమారు రూ. కోటి అవినీతి జరిగింది. అప్పటి నుండి విచారణ కొనసాగుతుంది. కొంతమంది బాధితులను పిలుచుకొని గోదావరిఖని పోస్టల్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, జమ్మికుంట పోస్టల్ ఇన్స్పెక్టర్ మోహన్ లు విచారణ జరిపారు. గత 15 నెలలుగా డబ్బులు అందుకోకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.

# ఎగువ అడ్డుకట్టలు... దిగువ రైతుల కడగండ్లు

- ◆ కాలువ మూగబోయింది ◆ రైతు గుండె బిగుసుకుంది
- ◆ ఆయకట్టు చివరి గ్రామాల చావు పిలుపు
- ◆ వేలాది ఎకరాల ఆరుతడి పంటల మరణ శాసనం
- ◆ నోటికొచ్చిన పంట కళ్ళముందే ఎండుతున్న దృశ్యం

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఓదెల కాల్వ శ్రీరాంపూర్ మండలాల రైతుల జీవనాడి అయిన డి-86 కెనాల్ ఆధారంగా సాగుచేసిన ఆరుతడి పంటల భవిష్యత్తు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ఆశతో వేలాది ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంట భవిష్యత్తు అనిస్థితిలో పడింది. ఈసారి కాలువ నీళ్లు అందకపోవడంతో రైతుల గుండెల్లో ఆందోళన మొదలైంది. కాలువలో కనిపించని నీళ్లు రైతుల కళ్ళల్లో కనబడుతున్నాయి. మొన్నటి వరకు వద్దన్నా వచ్చిన నీళ్లు వృధాగా మానేరు పాలయ్యాయని ఇప్పుడు అవసరమైన సమయంలో మాత్రం రావడం లేదు అంటూ రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.దుక్కి దున్నడంతో ఖర్చుల లెక్క మొదలు పెడితే విత్తనాలు, ఎరువులు,పురుగు మందులు,కూలీలు కలిపి లక్షల్లో పెట్టుబడి పెట్టి పంటను నిలబెట్టిన రైతులు తీరా చేతికి అందుతుందా లేదా అని ఆందోళన చెందుతున్నారు. వారబంది వాయిదా తో వచ్చే నీళ్లు ఈసారి అందకపోవడంతో మళ్లీ వచ్చే వాయిదాలోపు పంట పూర్తిగా ఎండిపోతదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో ఉన్న రైతులు కాలువలో కట్టిన అడ్డుకట్టల వల్ల చివరి గ్రామాలకు నీళ్లు అందడం లేదని ఆరోపిస్తున్నారు. మరి ఈ కట్టలను తొలగించాల్సిన బాధ్యత ఎవరిది? ఆయకట్టు చివరి రైతును ఆదుకునేది ఎవరు? రైతులే వెళ్లి కట్టలను తొలగిస్తే గొడవలు జరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అధికారులను అడిగితే ప్రతి సంవత్సరం అనుభవిస్తున్నదే కదా ఇందులో కొత్తేమున్నది అంటూ తేలికగా కొట్టి పారేయడంతో పాటు, సానుభూతి చూపిస్తున్నారే గాని ఎగువ ప్రాంతంలో ఉన్న కట్టలను తెంపి దిగువ రైతులను కాపాడే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. భూతల్లికి పచ్చని రంగు అద్దినట్టు కలకలలాడుతున్న మొక్కజొన్న పంట మెల్లమెల్లగా పసుపు రంగులోకి మారుతున్నది. ఈ తడి అందకపోతే వేలాది ఎకరాల పంట బూడిద పాలు అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాలువ డ్రాప్ ల వద్ద రాత్రి పగలు తేడా లేకుండా కాచుకుని కూర్చుంటున్నారు. నీళ్లు వస్తే ప్రాణం నిలబడ్డట్టే అని ఆశగా ఎదురు చూస్తున్నారు. డి-86 ఆయకట్టు చివరి గ్రామాల రైతుల గుండెచప్పుడు ఈ నాయకులకు, అధికారులకు వినిపిస్తుందా? లేక ఈ? సీజన్ ఇలాగే కన్నీటితో ముగుస్తుందా? ఇకనైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ఎగువన ఉన్న అడ్డుకట్టలను తొలగించి పంటలను కాపాడాలని బాధిత రైతులు కోరుతున్నారు.


డ్రాప్ దిగనంటున్న కాలువ నీళ్లు


ఎండుతున్న మొక్కజొన్న పంటలో రైతు రాపర్తి మల్లయ్య

# పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం....

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో 2026-28 రెండేళ్ల కాల పరిమితికి గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా మెతుకు తిరుపతి, ఉపాధ్యక్షులుగా నీలం నరేందర్, తాళ్ళ నరేందర్, ప్రధాన కార్యదర్శిగా సట్టు కనకయ్య, ఆర్థిక కార్యదర్శిగా కర్రె ప్రవీణ్, ప్రచార కార్యదర్శిగా అలుగం కనకయ్య, గౌరవ అధ్యక్షులుగా వాలుక హనుమంతు,గౌరవ సలహాదారుగా చాట్ల ఆగయ్య,కార్యవర్గ సభ్యులుగా ఒల్లే శ్రీనివాస్ యాదవ్, రామగిరి స్వామి, వడ్డేపల్లి రాజేషం, కర్నె రాజు, సుంకే



నర్సింగంలు నియమితులయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మెతుకు తిరుపతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. పెద్దపల్లిలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయులందరినీ ఒక్క తాటిపైకి తెచ్చి,వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన ప్రకటించారు. ఈ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల అధికారి హనుమంత్ కు, సహకరించిన పెద్దలకు, కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వెసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సోలార్ ప్రాజెక్టు వేరే చోటుకు మార్చకపోతే పోరాటాలు ఉధృతం

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామ స్మశాన వాటికలో నిర్మిస్తున్న సోలార్ ప్రాజెక్టు రద్దు చేసి వేరొక చోట నిర్మించాలని చేస్తున్న పోరాటంలో భాగంగా బుధవారం గ్రామస్తులు స్మశాన వాటికలో నిరసన తెలియజేసారు. ఐదు రోజుల నుండి స్మశాన వాటికలో నిర్వహిస్తున్న సోలార్ ప్రాజెక్టును రద్దు చేయాలని శాంతి యుతంగా నిరసన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం గానీ సోలార్ ప్రాజెక్టు నిర్వహాలు ఇప్పటివరకు కూడా సోలార్ ప్రాజెక్టును వేరే ఒక చోటికి తరలించక పోవడం సరైనది కాదని ప్రజలు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సోలార్ ప్రాజెక్టును వేరొక చోటికి మార్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని సోలార్ ప్రాజెక్టు నిర్వాహకులని హెచ్చరిస్తున్నామని అన్నారు. ఎవరైనా మరణిస్తే సమాధి చేసుకోవడానికి భూమి లేకుండా చేయడం సరైనది కాదు గత కొన్ని సంవత్సరాలనుండి నిర్మించుకున్న సమాధి లను కూల్చడం కూడా జరుగుతుంది



దీన్ని ఆపాలి స్మశాన వాటికి ను కాపాడుకునే వరకు పోరాడుతాం అని అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు మోదుంపల్లి శ్రవణ్, కుమ్మరి నవీన్, చాటకొల్లా తిరుపతి, ఎంజాల్ కుమార్ శ్రీశైలం, ప్రవీణ్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ గుడి వద్ద సెల్ టవర్ నిర్మాణం వద్దు.....

**- గ్రామ సభలో గ్రామస్థుల తీర్మానం**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పోచమ్మ గుడి వద్ద గ్రామ పంచాయితీకి సమాచారం లేకుండా పోచమ్మ గుడి వద్ద నిర్మాణం చేపట్టిన సెల్ టవర్ పనులు నిలిపివేయాలని పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామ పంచాయితీ ఆవరణలో బుధవారం సర్పంచ్ మేకల రోజారాణి విజయ్ కుమార్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. పోచమ్మ గుడి ముందు సెల్ టవర్ నిర్మాణ పనులు చేస్తుండగా గ్రామస్థులు పంచాయితీ పాలకవర్గం ఆద్వర్యంలో పనులు నిలిపివేయించారు. గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా సెల్ టవర్ నిర్మాణం చేయవద్దని, అవసరమైతే ప్రజలకు ఇబ్బందులు లేకుండా వేరే ప్రాంతంలో సెల్ టవర్ నిర్మాణం చేపట్టుకుంటే అభ్యంతరం లేదని గ్రామసభలో ప్రజలు, పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామసభ తీర్మానాన్ని జిల్లా కలెక్టర్ కు సమర్పించాలని ప్రజలు పంచాయితీ కార్యదర్శికి సూచించారు. ఒకవేళ సెల్ టవర్ నిర్మాణ పనులు అక్రమ మార్గంలో కొనసాగిస్తే పెద్దపల్లి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని పలువురు గ్రామస్థులు తెలిపారు. సమావేశంలో ఉప సర్పంచ్ జంగిలి శేఖర్, పంచాయితీ కార్యదర్శి ఝాన్సీ, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఉదయాన్నే ఖాళీకడుపుతో ఇవి రెండంటే రెండే ఆకులు తినడం అలవాటు చేసుకోండి..!



తులసిలో యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. రోగాల బారిన పడకుండా శరీరాన్ని రక్షిస్తుంది. సీజనల్ వ్యాధులను దూరం చేయడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి. తులసి ఆకులను తినటం వల్ల మనసును ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. తులసి ఆకులు పళ్లు, చిగుళ్ళ ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సహాయపడుతుంది. తులసి ఆకుల రసం లేదా కషాయాన్ని నోటితో పుక్కిలించి ఉమ్మేయటం వల్ల నోటి నుంచి వచ్చే వాసన తగ్గిపోతుంది. వర్షాకాలంలో తులసి ఆకులను తినడం వల్ల శ్వాసకోశ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఇది శ్వాసకోశ వ్యవస్థను శుభ్రపరుస్తుంది. జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలను తగ్గిస్తుంది. తులసి ఆకులను నమలడం వల్ల దానిలోని పోషకాల వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది. ఆకలిని నియంత్రించడంలో కూడా ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పరగడుపునే తులసి ఆకులను తినటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. మధుమేహం ఉన్నవారికి చాలా మంచిది. అంతేకాదు, తులసిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. రక్తపోటును తగ్గించి, హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. తులసిలో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె వంటి అనేక రకాల విటమిన్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి. తులసిలో కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్, ఐరన్, పొటాషియం వంటి ఖనిజాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఎముకల ఆరోగ్యానికి, రక్త ప్రసరణకు, నరాల ఆరోగ్యానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

# వ్యవసాయ కూలీ మృతి



**మంథని, మార్చి 4 (ది క్రైమ్ న్యూస్):** పురుగుల మందు త్రాగి కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కమాన్ పూర్ మండలం పేరపల్లి లో చోటు చేసుకుంది. మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పేరపల్లి గ్రామానికి చెందిన చెప్పాల దేవేందర్ గత 15 సం.ల క్రితం అదే గ్రామానికి చెందిన మల్లీశ్వరి ని ప్రేమ వివాహం చేసుకున్నాడని, గత కొన్ని రోజులుగా భార్యా భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య తన పుట్టింటికి వెళ్లిందని అన్నారు. భార్య కాపురానికి రావడం లేదని, మానసికంగా కృంగిపోయి దేవేందర్ మద్యానికి బానిసైనాడని తెలిపారు. మంగళవారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో ఇంటి నుండి బయటికి వెళ్లిపోయాడని మృతుని తల్లి తెలిపింది. తన కొడుకు రాత్రి రాకపోవడంతో బంధువులు వెతికినట్లు తెలిపారు. బుధవారం ఉదయం సుమారు 6:30 ప్రాంతంలో పేరపల్లి గ్రామ రెవెన్యూ శివారులోని తన పొలం ప్రక్కన గల ప్రత్తి చేనులో తన కొడుకు విగత జీవిగా పడి ఉన్నట్లు మృతుని తల్లి, సోదరులు తెలిపారు. మృత దేహం ప్రక్కన లిక్కర్ సీసా, క్రిమి సంహారక మందు డబ్బా మరియు సెల్ ఫోన్ ఉన్నాయి. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు డెడ్ బాడీని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలం వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి.

# రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి

**- నీటిపారుదల శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా రైతులు యాసంగిలో వేసిన పంటలకు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నేటి పారుదల శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నాడు వారు మీడియాతో మాట్లాడుతూ శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ కాకతీయ కాలువ ద్వారా సాగునీరు డి-83, డి-86 కాలువలకు పెద్దపల్లి జిల్లాలో 5వ విడత నీటి విడుదల మార్చి 1వ తేది నాడు ప్రారంభమైశీదని ఈ విడతలో 8 రోజుల పాటు 9 మార్చి వరకు నీటి విడుదల జరుగుతుందని, సాగు నీరు అన్ని కాలువలకు చివరి వరకు అందించుటకు నీటిపారుదల శాఖ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని, రైతులు సిబ్బందికి సహకరించి తమ పొలాలకు నీటిని ఉపయోగించు కోవాలని తెలిపారు.

# పోచమ్మ వాడలో పుట్టగొడుగుల్లా ఆరు బెల్ట్ షాపులు

**- పోచమ్మ వాడలో బెల్ట్ షాపులు తొలగించాలని వినతి**



**రామగిరి ,మార్చి 04(ది క్రైమ్ న్యూస్):-** మంథని పట్టణంలోని పోచమ్మ వాడలో బెల్ట్ షాపులు నడుపుతూ కల్తీ మద్యం విక్రయిస్తూ కుటుంబాలను ఇచ్చినశీ చేస్తున్నారని వెంటనే ఎక్సైజ్ అధికారులు తొలగించాలని పోచమ్మ వాడ స్థానిక వాడ పెద్ద మనుషులు లైసెట్టి రాజు పిల్లి సత్తయ్య, సంఘి శీనుతో పాటు పలువురు వినతి పత్రం అందజేశారు. బుధవారం మంథని ఎక్సైజ్ ఎస్సై సాయికి వినతి పత్రం అందజేస్తూ పోచమ్మ వాడలో పుట్టగొడుగుల్లా ఆరు బెల్ట్ షాపులు ఉన్నాయని కల్తీ మద్య విక్రయిస్తూ పేదలను దోచుకుంటున్నారని కుటుంబం కుటుంబాలను విచ్చినం చేస్తున్నారని, యువకులు పెడదారి పడుతున్నారని వారు ఆపోయారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు వెంటనే స్పందించి బెల్ట్ షాపులను మూసివేయాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో మహిళలతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని మహిళలు తాటి దుర్గమ్మ, కొట్టే లింగమ్మ, మిట్ట శంకరమ్మ,గడిలక్ష్మి, తాటిలక్ష్మి, శెట్టి శివమ్మ, తాటిమల్లక్క లు హెచ్చరించారు.

# రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపికైన కోరపల్లి పాఠశాల



**జమ్మికుంట మార్చి 4 (ది క్రైమ్ న్యూస్):** జడ్పీహెచ్ఎస్ కోరపల్లి పాఠశాల కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి రొంటాల సాయి రిత్విక్ జంతువుల బారి నుండి పంటల రక్షణ కొరకై తయారుచేసిన స్మార్ట్ క్రాప్ ప్రొటెక్షన్ ఫ్రమ్ అనిమల్స్ రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ అవార్డ్ కు 2025- 26 ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేతిరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇట్టి ఇన్నోవేషన్ కి గైడ్ టీచర్లుగా వ్యవహరించిన పెండెం శ్రీనివాస్, రవికాంత్ రాజులను ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# రోడ్డు వేశారు.. కరెంట్ పోల్ తీయడం మరిచారు

## ◆ నిబంధనలు పాటించని రోడ్డు కాంట్రాక్టర్ ఆర్ అండ్ బి అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు ◆ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్

**రామగిరి, మార్చి 04(ది క్రైమ్ న్యూస్):-** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో పాత పెట్రోల్ బంక్ ఏరియా మంథని నుండి పెద్దపల్లి,కాటారం కు వెళ్లే ప్రధాన రహదారి వెంట రెండు వరుసల బీటీ నూతన రోడ్డు నిర్మాణం కొనసాగుతోంది. దీంట్లో భాగంగా మంథని మండల కేంద్రంలోని నూతన రోడ్డు నిర్మాణ పనులను ప్రజా సంఘాల నాయకులతో కలిసి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంథని లో గ్రామాభివృద్ధి పేరుతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు శాపంగా మారుతున్నాయి. బీటీ రోడ్డు నిర్మాణం కంటే ముందే కరెంట్ పోల్ తీయకుండా రోడ్డు నిర్మించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పై ఫోటోలో కనిపిస్తున్నట్లుగా బీటీ రోడ్డు నిర్మించి మధ్యలో కరెంట్ పోల్ ఉండటంతో రాత్రిపూట రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నడిరోడ్డు మీద పోల్ ఉండటం వల్ల ద్విచక్రవాహనదారులు, ఆటోలు, ట్రాక్టర్లు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. పోల్స్ పక్కకు మార్చాల్సిన గుత్తేదారు పట్టించుకోకపోవడం వలన వాహనాలు పోల్ ని ఢీకొనే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణనష్టం జరిగితే భాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బీ అధికారులు ముందస్తు ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడంతో ఈ దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వెడల్పు పనులు పూర్తయినా కరెంటు పోల్ మాత్రం అలాగే ఉండటంతో ద్విచక్ర వాహనదారులు పోల్ను తప్పించేందుకు ఎదురుగా వచ్చే వాహనాల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖాదికారులు స్పందించి నడిరోడ్డు మీద ఉన్న కరెంట్ పోల్ను వెంటనే తొలగించి రోడ్డును సక్రమంగా నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అతని వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ కేవీపీఎస్ జిల్లా నాయకులు ముంథని లింగయ్య ఉన్నారు.



# పారిశ్రామిక సంస్థలను సందర్శించిన ఇల్లందకుంట విద్యార్థులు..

**ఇల్లందకుంట మార్చి 4 (ది క్రైమ్ న్యూస్):** పారిశ్రామిక సంస్థల సందర్శనలో భాగంగా పి ఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇల్లందకుంట విద్యార్థిని విద్యార్థులు జమ్మికుంట లోని కాటన్ జిన్నింగ్ మిల్లులు, రైస్ మిల్లులు మరియు ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం, అగ్నిమాపక కేంద్రం సందర్శించారు. అకాడమిక్ క్యాలెండర్ లో భాగంగా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు నేడు విద్యార్థులు కాటన్ మిల్లులో జరిగేటువంటి కార్యక్రమాలను వీక్షించారు. పలు విషయాలను, వారి యొక్క సందేహాలను ఆయా పరిశ్రమలలోని నిపుణులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా కృషి విజ్ఞాన కేంద్రంలోని సేంద్రియ ఎరువుల తయారీ విధానం వాటి యొక్క ఉపయోగాలు, వ్యవసాయ వైవిధ్యానికి సంబంధించినటువంటి పంటల తీరును శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. జమ్మికుంట అగ్నిమాపక కేంద్రంలో ముఖ్యంగా వేసవికాలంలో మరియు ఇతర కాలాలలో రాబోయే అగ్ని సంబంధిత విపత్తులను, గృహ ఉపయోగ గ్యాస్ సిలిండర్ ప్రమాదాలను ఎదుర్కోవడంలోని మెలకువలను తెలుసుకున్నారు. ఈ సందర్శన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తస్లీన్ నజ్మీన్, ఉపాధ్యాయులు చిటికెన వేణు, కే. శంకర్, కొండ సత్యం, జి. అన్నపూర్ణ, ఏం. ఐలయ్య, జి. లావణ్య, రామకృష్ణ, పరమేశ్వర్, దేవేందర్, కాటన్ మిల్లు యాజమాన్యం ఆకుల రాజయ్య, ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# ఈ సమస్యలున్న వారు పొరబాటున కూడా కాలీఫ్లవర్ ముట్టుకోకూడదు.. ఎందుకంటే?



కాలీఫ్లవర్‌లో ఆరోగ్యానికి మేలు చేసే అనేక విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. కానీ ప్రతిరోజూ కాలీఫ్లవర్ తినడం కొంతమందికి కొన్ని రకాల ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. అందుకే ఈ సమస్యతో బాధపడేవారు కాలీఫ్లవర్ తినకుండా దూరంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీరు గ్యాస్, ఎసిడిటీ సమస్యలతో బాధపడుతుంటే క్యాలీఫ్లవర్ వినియోగాన్ని తగ్గించాలి. క్యాలీఫ్లవర్‌లో కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి జీర్ణ సమస్యలను పెంచుతాయి. అలాగే మీరు థైరాయిడ్ సమస్యలతో బాధపడుతుంటే కాలీఫ్లవర్ తినకండి. ఇది మీ సమస్యలను మరింత పెంచవచ్చు. కాలీఫ్లవర్ తినడం వల్ల థైరాయిడ్ గ్రంథి అయోడిన్‌ను ఉపయోగించుకునే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. దీనివల్ల సమస్యలు తలెత్తుతాయి. కాలీఫ్లవర్ ముఖ్యంగా 3, %4 హార్మోన్ల స్థాయిలను ప్రభావితం చేస్తుంది. కాబట్టి, థైరాయిడ్ రోగులు కాలీఫ్లవర్ వినియోగాన్ని తగ్గించాలి. మీకు గాల్ బ్లాడర్, కిడ్నీలో రాళ్లు ఉన్నట్లయితే కాలీఫ్లవర్ తినకపోవడమే మంచిది. కాలీఫ్లవర్‌లో క్యాల్షియం ఉంటుంది. ఇది రాళ్ల సమస్యను పెంచుతుంది. అలాగే మీకు రక్తం గడ్డకట్టే సమస్యలు ఉంటే కాలీఫ్లవర్ తినవద్దు. కాలీఫ్లవర్‌లో అధిక మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది శరీరంలోని రక్తాన్ని చిక్కగా చేస్తుంది. కాబట్టి ఇలాంటి వారు కాలీఫ్లవర్ అస్సలు తినకూడదు. గర్భధారణ సమయంలో కాలీఫ్లవర్ తినకూడదు. దీని వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా గర్భధారణ సమయంలో గ్యాస్, ఎసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి క్యాలీఫ్లవర్‌ను నివారించడం చాలా ముఖ్యం.



# ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా..? డయాబెటిస్ రోగానికి చేరువైనట్లే..



ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, తప్పుడు ఆహారపు అలవాట్ల వల్ల మధుమేహం (డయాబెటిస్) కేసులు వేగంగా పెరుగుతున్నాయి. మధుమేహం ముందు పరిస్థితిని అంటే.. రోగం ప్రారంభానికి ముందు ప్రీడయాబెటిస్ అని పిలుస్తారు. మధుమేహం ప్రారంభ దశలో రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయి.. క్రమంగా పెరుగుతుంటాయి.. అయితే.. ప్రీడయాబెటిస్‌ను గుర్తించడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఇది మధుమేహం ప్రారంభ సంకేతం.. ఈ దశలో సరైన చర్యలు తీసుకుంటే, ఈ వ్యాధిని నివారించడం సాధ్యమవుతుంది. వైద్య నిపుణుల ప్రకారం.. ప్రీడయాబెటీస్ రోగులలో రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణ లేకుండా పోయే అవకాశం ఉంది.. ఇది తరువాత టైప్ 2 మధుమేహం రూపాన్ని తీసుకోవచ్చు.. సరైన సమయంలో గుర్తించడం ద్వారా డయాబెటిస్ ను నియంత్రించవచ్చు. సరైన వైద్యాన్ని తీసుకోవచ్చు.. ప్రీడయాబెటిస్ లక్షణాలు: ప్రీడయాబెటిస్ లక్షణాలు తరచుగా చాలా తక్కువగా ఉంటాయి.. ప్రజలు సాధారణంగా వాటిని విస్మరిస్తారు. కానీ అలసట, తరచుగా దాహం, ఆకలి పెరగడం, బరువులో అవాంఛనీయ మార్పులు వంటి చిన్న చిన్న సమస్యలపై శ్రద్ధ పెట్టాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కువసార్లు మూత్రవిసర్జన చేయడం, తరచుగా పుండ్లు కావడం, చూపు స్పష్టంగా లేకపోవడం, గాయాలు, దెబ్బలు త్వరగా మానకపోవడం కూడా ప్రీడయాబెటిస్ సంకేతాలే.. ఈ లక్షణాలు కనిపిస్తే, వెంటనే రక్తంలో చక్కెరను తనిఖీ చేయాలి. సమయానుకూలంగా పరీక్షలు చేయించుకోవడం – జీవనశైలిలో మార్పులు తప్పనిసరి.. ఇంకా, మంచి ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యమని వైద్యనిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వారి కుటుంబంలో మధుమేహం ఉన్నా.. ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు రక్తంలో చక్కెరను క్రమం తప్పకుండా పరీక్షించడం అవసరం. రెగ్యులర్ పరీక్షల ద్వారా, ప్రీడయాబెటిస్‌ను గుర్తించడం మాత్రమే కాకుండా దానిని సకాలంలో నియంత్రించవచ్చు. ప్రిడయాబెటిస్ రిస్క్ నుంచి ఇలా బయటపడండి: ఆరోగ్యకరమైన ఆహారం, పండ్లు, కూరగాయలు, గింజలు, తృణధాన్యాలు, ఆలివ్ నూనె అధికంగా ఉండే ఆహారం ప్రిడయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మరింత చురుకుగా ఉండటం, బరువు తగ్గడం, ధూమపానం మానేయడం, అవసరమైన మేరకు మందులు తీసుకోవడం ద్వారా ప్రిడయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు..

# మీకెప్పుడైనా తీవ్ర భయం, ఆందోళనగా అనిపిస్తే.. వెంటనే ఇలా చేయండి! 2 నిమిషాల్లో నార్మల్ అవుతారు



మనిషి శారీరకంగా ఎంత ఆరోగ్యంగా ఉన్నా, మానసికంగా ప్రశాంతత లేకపోతే జీవన గందరగోళంగా ఉంటుంది. సరైన సమయంలో చికిత్స తీసుకోకుంటే దీర్ఘకాలిక రుగ్మతలకు దారి తీస్తుంది. తద్వారా విపరీత ఆలోచనలతో ఆత్మహత్యలకు ప్రేరేపిస్తుంది. మితిమీరిన ఆందోళన, పని ఒత్తిడి, కుటుంబ సమస్యల గురించి అతిగా ఆలోచించడం మిమ్మల్ని మానసికంగా, శారీరకంగా అనారోగ్యానికి గురి చేస్తుంది. ఇది ఆందోళన వంటి సమస్యలను కూడా కలిగిస్తుంది. ఇది ఒక రకమైన మానసిక రుగ్మత. ఇది నిద్రను కూడా ప్రభావితం చేస్తుంది. కండరాల ఒత్తిడిని పెంచుతుంది. జీర్ణ సమస్యలు, చిరాకు, ఏకాగ్రత లేకపోవడం, తీవ్ర భయాందోళనలకు గురవుతుంటారు. దేశంలో దాదాపు 88% మంది ప్రజలు ఏదో ఒక రకమైన ఆందోళనతో బాధపడుతున్నారని ఒక అధ్యయనం వెల్లడించింది. అంటే ప్రతి 100 మందిలో 88 మంది ఈ మానసిక రుగ్మతకు గురవుతున్నారన్నమాట. కాబట్టి మీ చుట్టుపక్కల ఎవరైనా పానిక్ అటాక్‌తో బాధపడుతున్నట్లయితే, ఇలా చేయండని మానసిక వైద్యులు సలహా ఇస్తున్నారు. మీరూ పానిక్ అటాక్‌తో బాధపడుతుంటే ఎలా సహాయం చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.. నీళ్లు తాగడం వల్ల వారిలో కొంత భయం, ఆందోళన తగ్గుతాయి. చల్లటి నీరు తాగడం వల్ల పారాసింపథెటిక్ నాడీ వ్యవస్థ ఉత్తేజితమవుతుంది. ఇది వ్యక్తిని శాంతింపజేయడానికి సహాయపడుతుంది. తీవ్ర భయాందోళనకు గురైతే వెంటనే చేతులు, కాళ్ళను చల్లటి నీటితో కడగాలి. అలాగే టవల్‌ను తడిపి మీ ముఖం లేదా మెడపై ఉంచుకోవాలి. ఇది భయం నుండి కొంచెం శాంతపరచడానికి సహాయపడుతుంది. మీ చుట్టుపక్కల లేదా ఇంట్లో ఎవరైనా భయాందోళనకు గురవుతున్నట్లు అనిపిస్తే.. మీరు వారి ప్రవర్తనను చూస్తే దూరంగా ఉండకండి.బదులుగాఆవ్యక్తిని సౌకర్యవంతమైన కుర్చీ లేదా సోఫాలో కూర్చోబెట్టి.. కాసేపు మీరు వారితో గడపడానికి ప్రయత్నించాలి.

# సాక్స్ లేకుండా షూస్ వేసుకుంటున్నారా? నష్టాలు ఏంటో తెలుసుకోండి!



సాధారణంగా చాలా మంది సాక్స్ లేకుండా షూస్ వేసుకుంటారు. ఇటీవలి కాలంలో కూడా యువతలో ఇలాంటి ఫ్యాషన్ ఎక్కువగా ఉంది. సాక్స్ లేకుండా షూస్ వేసుకోవడం వల్ల పాదాల్లో దుర్వాసన రావడమే కాకుండా ఆరోగ్యం కూడా పాడవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో చెమట ఎక్కువగా ఉండే భాగాలలో పాదాలు ఒకటి. అలాగే రోజంతా షూస్ వేసుకోవడం వల్ల చెమట ఎక్కువగా పడుతుంది. అందుకే దీనిని వదిలించుకోవడానికి, వాసనను నివారించడానికి, పాదాలను పొడిగా ఉంచడానికి సాక్స్ ఉత్తమం. వీటన్నింటితో పాటు, ఇది తరచుగా పాదాలకు చెమట పట్టడాన్ని నివారిస్తుంది. అందుకే సాక్స్ లేకుండా బూట్లు ధరించడం వల్ల కలిగే నష్టాలు ఏమిటి? సాక్స్ మన పాదాలను ఎలా ఆరోగ్యంగా ఉంచుతుంది? దానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకుందాం. వేసవికి మాత్రమే కాకుండా శీతాకాలానికి కూడా మంచిది: సాక్స్ ధరించడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఇది అనేక రకాల బ్యాక్టీరియా నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అలాగే వీటిని ధరించడం వల్ల ఎలాంటి ఫంగల్ లేదా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు దరిచేరవు. సాక్స్ వేసవిలో చెమట పట్టకుండా నిరోధించడమే కాకుండా శీతాకాలానికి కూడా మేలు చేస్తుంది. ఎందుకంటే ఆ సమయంలో సాక్స్ వేసుకోవడం వల్ల జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే ఇవి మీ పాదాలను వెచ్చగా ఉంచుతాయి. అలర్జీ సమస్య: సాక్స్ ధరించకుండా షూస్ వేసుకునే వారికి అలర్జీ సమస్య రావచ్చు. కొంతమందికి చాలా సున్నితమైన చర్మం ఉంటుంది. అందుకే అబ్బాయిలు, సాక్స్ లేకుండా బూట్లు ధరించవద్దు. లేకపోతే చాలా మందికి పాదాలకు చెమట పట్టడం, వారి పాదాలకు అనేక రకాల సమస్యలు వస్తాయి. చెమట బూట్ల లోపల తేమను మరింత పెంచుతుంది. ఇది వివిధ రకాల బ్యాక్టీరియా లేదా ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దారి తీస్తుంది. కొందరికి సాక్స్ లేకుండా షూస్ వేసుకోవడం వల్ల పాదాలకు పొక్కులు వస్తాయి. ఇలాంటి సమస్య రాకుండా ఉండాలంటే బూట్లు వేసుకునే వారు సాక్స్ ధరించాలని నిపుణులు చెబుతున్నారు.

# పెసర పిండితో ఇలా చేస్తే ముఖంపై జిడ్డు, మృతకణాలు మాయం..! అదిరి పోయే అందం మీ సొంతం..



మన వంటింట్లో లభించే సహజ సిద్ధమైన పదార్థాలు మన చర్మ సౌందర్యాన్ని పెంచడమే, చర్మం ఎంతో ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. ఇందులో పెసలు మన చర్మ సౌందర్యాన్ని పెంచడంలో చక్కగా పని చేస్తుందని చెబుతున్నారు. చర్మానికి ఇది చేసే మేలు అంతా ఇంతా కాదు. చర్మాన్ని మృదువుగా చేయడంలోనూ, చర్మానికి మెరుపును ఇవ్వడంలోనూ, చక్కటి రంగు తేలేలా చేయడం లోనూ పెసర్లు చక్కగా పని చేస్తాయి. ఇందుకోసం కొద్దిగా పెసరపప్పు తీసుకుని బాగా ఎండబెట్టి పొడిలా చేసుకుని నిలువ చేసుకోవాలి. దీనిని ఫేస్ ప్యాక్ లాగా వేసుకోవాలి అనుకున్నప్పుడల్లా ఆ పెసరపిండిని వినియోగించుకోవచ్చు. రెండు టీ స్పూన్ల పెసరపప్పు పొడిని తీసుకొని అందులో కాస్త పసుపు వేసుకోవాలి. అందులో కావాల్సినంతా మోతాదులో పచ్చిపాలను కలుపుకుంటూ మెత్తటి పేస్ట్ లా తయారు చేసుకోవాలి. ఇపుడు ఆ మిశ్రమాన్ని ఫేస్ ప్యాక్‌లా ముఖానికి అప్లై చేసుకోవాలి. ఆ తర్వాత పదిహేను ఇరవై నిమిషాలకు ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి... ఇలా వారానికి రెండు మూడు సార్లు చేయడం వలన చక్కటి ఫలితాలను పొందగలరు. మూడు టీ స్పూన్ల పెసరపిండి, ఒక టీ స్పూను బియ్యప్పిండి, కొద్దిగా పసుపు వేసి దానికి రోజ్ వాటర్ కలిపి మెత్తని పేస్ట్ లా చేసుకోవాలి. తర్వాత ఆ పేస్ట్ ను ముఖానికి అప్లై చేసుకుంటూ బాగా మసాజ్ చేయాలి. ఇలా చేయడం వలన చర్మ రంధ్రాలోని మురికి, బ్యాక్టీరియా పోయి చర్మం కాంతి వంతంగా కనిపిస్తుంది. చర్మం బరకగా కనిపిస్తుంటే ఇబ్బందిగా ఉంటుంది. అలాంటప్పుడు కప్పు పెసర పిండిలో చెంచా నిమ్మరసం, చెంచా ఆలివ్ నూనె కలిపి ఆ మిశ్రమాన్ని ఒంటికి పట్టించి నలుగులా రుద్దుకోవాలి. ఇలా రోజూ చేస్తుంటే మృతకణాలు తొలగి చర్మం నునుపుగా మారుతుంది.

# షుగర్ ఉన్నవాళ్లు, గర్భిణీ స్త్రీలు టమాటో తినకూడదా..? ఇదిగో క్లారిటీ

టమాటోలో విటమిన్ సి, పొటాషియం, ఫోలేట్, విటమిన్ కె పుష్కలంగా ఉంటాయి. అలానే విటమిన్ ఇ, థయామిన్, నియాసిన్, విటమిన్ బి6, మెగ్నీషియం, ఫాస్ఫరస్, కాపర్ కూడా పుష్కలంగా లభిస్తాయి. అయితే రైతులు ఈ మధ్యకాలంలో కూరగాయలు, టమాటో పంటలకు ఎక్కువగా పురుగుమందులు వాడుతున్నారు. అందుకే వాటిని కట్ చేసేముందు శుభ్రంగా కడగాలి. ఆర్గానిక్ టమాటోలు దొరికితే మరీ మంచిది. 100 గ్రాముల టమాటోలలో సుమారు 22 కేలరీలు, 4.8 గ్రా కార్బోహైడ్రేట్లు, 3.2 గ్రా చక్కెర, 1.1 గ్రా ప్రోటీన్, 0.2 గ్రా కొవ్వు, 1.5 గ్రా ఫైబర్ ఉంటాయి. ఆహారంలో టమాటోలు తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. కొలెస్ట్రాల్, రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. టమాటోల్లోని లైకోపీన్ అనే పదార్థం ప్రోస్టేట్ క్యాన్సర్‌ను నివారిస్తుంది. అలానే వాటిల్లోని పీచు పదార్థం జీర్ణక్రియ సక్రమంగా జరిగేలా చేస్తుంది. టమాటోలో బీటా కెరోటిన్, లుటిన్ పుష్కలంగా ఉండటం వల్ల కంటి వ్యాధుల నుండి రక్షిస్తుంది. అంతేకాకుండా, టమాటోలో విటమిన్లు. యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. టమాటాలోని లైకోపీన్ అనే పదార్థం వంటి హానికరమైన కిరణాల ప్రభావాల నుండి చర్మాన్ని రక్షిస్తుంది. షుగర్ ఉన్నవారు టమాటోలు తినవచ్చా?



టమాటోలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. దీనిని మధుమేహ వ్యాధిగ్రస్తులు తినవచ్చు. కానీ వీటిని సమతుల్య ఆహారంలో భాగంగా మాత్రమే తీసుకోవాలి. రక్తంలో చక్కెర స్థాయిలను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం మర్చిపోవద్దు. గర్భిణీ స్త్రీలు టమాటాలు తినవచ్చా? టమాటోలో ఫోలేట్ ఉంటుంది. పిండ నాడీ ట్యూబ్ అభివృద్ధికి ఇది చాలా అవసరం. వీటిలోని విటమిన్ సి, పొటాషియం తల్లి, బిడ్డకు అవసరమైన పోషకాలను అందిస్తాయి. కొంతమందికి టమాటో అంటే ఎలర్జీ వస్తుంది. చర్మంపై దద్దుర్లు రావడమే కాకుండా జీర్ణ సమస్యలు కూడా వస్తాయి. టమాటోలో మాలిక్, సిట్రిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటాయి. ఇది కడుపు నొప్పిని కలిగిస్తుంది. టమాటోలు ఎక్కువగా తీసుకోవడం వల్ల జీర్ణకోశ సమస్యలు వస్తాయి. అయితే టమాటో తింటే బరువు పెరుగుతారని కొందరు అనుకుంటారు. అయితే అది నిజం కాదు. టమాటోలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. పచ్చి టమాటోలు ఉడికించిన వాటి కంటే మంచివి. వాటిని వండకుండా పచ్చిగా తినడం ఆరోగ్యానికి మరింత మేలు చేస్తుంది. టమాటోలు తింటే కిడ్నీలో రాళ్లు వస్తాయనే అపోహ కూడా ఉంది. టమాటోలో ఆక్సలేట్ ఎక్కువగా ఉన్నప్పటికీ.. మితంగా తింటే ఎలాంటి రోగాలు దరిచేరవని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఈ రక్త పరీక్ష ద్వారా క్యాన్సర్‌ను గుర్తించవచ్చు!


కొలొరెక్టల్ క్యాన్సర్ ఇటీవలి సంవత్సరాలలో చాలా సాధారణ వ్యాధి. ఈ క్యాన్సర్లు పెద్దప్రేగు లేదా పురీషనాళంలో ఏర్పడతాయి. కాలక్రమేణా ఆ పాలిప్స్ క్యాన్సర్‌గా మారవచ్చు. స్క్రీనింగ్ పరీక్షలు పాలిప్‌లను గుర్తించగలవు. ఇలా చేస్తే క్యాన్సర్‌గా మారకముందే వాటిని తొలగించవచ్చు. స్క్రీనింగ్ కొలొరెక్టల్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడంలో సహాయపడుతుంది. ఈ ఒక్క రక్తపరీక్షతో కొలొరెక్టల్ క్యాన్సర్ కూడా నిర్ధారణ అవుతుంది. మెడికల్ ఇన్నోవేషన్ పరంగా కొలొరెక్టల్ క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతోంది. ది న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురించబడింది. ఈ అత్యాధునిక స్క్రీనింగ్ సాధనం లక్షణాలు, ఇది క్యాన్సర్ నివారణ, గుర్తింపును ఎలా ప్రభావితం చేస్తుందో వివరిస్తున్నారు నిపుణులు. కొలొరెక్టల్ క్యాన్సర్ అనేది ఇటీవల పెరుగుతున్న వ్యాధి. ఒక కొత్త రక్త పరీక్ష క్లినికల్ ట్రయల్స్ ద్వారా దాని మ్యాచ్‌ను అందుకుంది. ఈ రక్త-ఆధారిత స్క్రీనింగ్ పరీక్ష కొలొరెక్టల్ క్యాన్సర్‌కు 100% స్క్రీనింగ్ పరీక్ష. ఇది 83% గుర్తింపు రేటును కలిగి ఉంది. పరీక్ష సాధారణ బ్లడ్ డ్రా ద్వారా



నిర్వహించబడుతుంది. రక్తప్రవాహంలో ప్రసరించే కణితి సంకేతాలను గుర్తించడం ద్వారా ఇది పనిచేస్తుంది. ప్రివెంటివ్ సర్వీసెస్ టాస్క్ ఫోర్స్ నుండి 45 సంవత్సరాల వయస్సులో రొటీన్ కొలొరెక్టల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభించడానికి సిఫార్సులు ఉన్నప్పటికీ, అర్హులైన పెద్దలలో గణనీయమైన భాగం సిఫార్సు చేసిన విధంగా స్క్రీనింగ్ చేయించుకోవడంలో విఫలమయ్యారు. ప్రస్తుతం, సమర్థవంతమైన స్క్రీనింగ్ మార్గాలలో మల పరీక్షలు, పెద్దప్రేగు పరీక్షలు కూడా ఉన్నాయి. ఇంకా రక్త పరీక్షల ఆగమనం స్క్రీనింగ్‌కు అడ్డంకులను తగ్గించింది. ఇది వ్యాధి నిర్ధారణను సులభతరం చేస్తుంది. కొలొరెక్టల్ క్యాన్సర్ అంటే ఏమిటి?: కొలొరెక్టల్ క్యాన్సర్ అనేది పెద్దప్రేగు లేదా పురీషనాళంలో ఉద్భవించే కణితి. ఇది ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ ప్రకారం, ఇందులో పెద్ద ప్రేగు, పెద్దప్రేగు, పురీషనాళం ఉన్నాయి. ఇది జీర్ణవ్యవస్థలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పెద్దప్రేగు 5 అడుగుల పొడవు గల కండరాల గొట్టం. ఇది పొడవు, అడ్డంగా, సిగ్మోయిడ్ కోలన్‌తో సహా వివిధ విభాగాల గుండా వెళుతుంది. కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రారంభ లక్షణాలు: పెద్దప్రేగు క్యాన్సర్ ప్రారంభ లక్షణాలు ముందుగానే గుర్తించడం, రోగనిర్ధారణ కోసం ముఖ్యమైనవి. ఎందుకంటే అది ప్రజల ప్రాణాలను కాపాడుతుంది. పెద్దప్రేగు క్యాన్సర్ పెద్దప్రేగు, పురీషనాళాన్ని లక్ష్యంగా చేసుకుంటుంది. ఇది క్యాన్సర్ అత్యంత సాధారణ రకాల్లో ఒకటి. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ సంబంధిత మరణాలకు ఇది రెండవ ప్రధాన కారణం. ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు నిరంతర విరేచనాలు, మలబద్ధకం లేదా వదులుగా ఉండే మలం, మల రక్తస్రావం, కడుపు నొప్పి, అధిక బరువు తగ్గడం, దీర్ఘకాలిక అలసట వంటి కారణాలు ఉండవచ్చు.

## పచ్చి క్యారెట్ తింటే పిచ్చెక్కించే బెనిఫిట్స్.. 1, 2 కాదు

క్యారెట్‌లను ఉడికించి కాకుండా పచ్చిగా తింటే శరీరానికి కావల్సినంత పోషకాలు అందుతాయని నిపుణులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా క్యారెట్ మహిళలకు మేలు చేస్తుందని అంటున్నారు. కాబట్టి పచ్చి క్యారెట్ తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాం పదండి పచ్చి క్యారెట్లు తింటే.. శరీరంలో ఈస్ట్రోజెన్ ఉత్పత్తి కంట్రోల్‌లో ఉంటుంది. వాస్తవానికి, అదనపు ఈస్ట్రోజెన్ మొటిమలు, ఒత్తిడి సహా ఇతర హార్మోన్ల అసమతుల్యతలకు కారణమవుతుంది. ఈ సమస్యను నివారించడంలో క్యారెట్ మనకు ఉపయోగపడుతుంది.అలాగే, పచ్చి క్యారెట్లు కడుపులోని చెడు బ్యాక్టీరియాను తగ్గించడంలో సహాయపడతాయి. క్యారెట్‌లో ప్రత్యేకమైన ఫైబర్స్ ఉంటాయి. జీర్ణక్రియ ప్రక్రియ సాఫీగా జరుగుతుంది. లివర్ మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సహాయపడుతుంది. పచ్చి క్యారెట్లు శరీరంలోని చెడు బ్యాక్టీరియా, ఎండోటాక్సిన్,



ఈస్ట్రోజెన్‌లను నియంత్రిస్తాయి. రోజుకు ఒక పచ్చి క్యారెట్ తినడం వల్ల కార్టిసాల్, ఎండోటాక్సిన్, ఈస్ట్రోజెన్ అధిక స్థాయిలో ఏర్పడకుండా అడ్డుకట్ట. ఎండోటాక్సిన్‌లను నిలువరించడంలో క్యారెట్ అద్భుతంలా పనిచేస్తుంది. క్యారెట్‌లో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం, 4 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లలకు రోజుకు కనీసం 700 నుండి 900 మైక్రోగ్రాముల విటమిన్ అవసరం. ఒక పచ్చి క్యారెట్ తినడం వల్ల తగినంత విటమిన్ ఎ అందుతుందని పేర్కొంది. క్యారెట్‌లో విటమిన్ ఎ, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. అందువల్ల, పచ్చి క్యారెట్‌లను తినడం వల్ల మొటిమలు, మచ్చలను నివారించవచ్చు. విటమిన్ ఎ థైరాయిడ్ పనితీరుపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. క్యారెట్‌లో విటమిన్ ఎ దండిగా ఉంటుంది. కాబట్టి హైపోథైరాయిడిజం ఉన్నవారికి క్యారెట్ ఒక వరమని చెప్పాలి. పచ్చి క్యారెట్ తింటే.. కంటి చూపును పదును అవుతుంది. రక్తపోటును తగ్గుతుంది. ప్రోటీన్‌ను పెంచడం, శక్తిని పెంచడం, ఎముకలను బలోపేతం చేయడం వంటి అనేక ప్రయోజనాలను చేకూరుతాయి. క్యారెట్‌లో క్యాలరీలు తక్కువగా, ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల బరువు తగ్గుతారు. ఇది అనవసర కొవ్వును తగ్గిస్తుంది.

# తక్కువ రక్తపోటు యమ డేంజర్!

## బీపీ పడిపోయినప్పుడు వెంటనే ఇలా చేయండి..





నేటి జీవనశైలి కారణంగా దాదాపు ప్రతి ఇంట్లో రక్తపోటు సమస్యతో బాధపడేవారు ఉన్నారు. అధిక రక్తపోటు మాత్రమే కాదు తక్కువ రక్తపోటు కూడా ఆరోగ్యానికి హానికరం.లో బీపీ కారణంగా అనేక తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి మీరు ఆరోగ్యంగా ఉండాలంటే రక్తపోటును సాధారణంగా ఉంచుకోవడం చాలా అవసరం. సాధారణ రక్తపోటు 120/80. కానీ 90/60కి పడిపోయిందంటే వెంటనే వైద్యుల సూచనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తక్కువ రక్తపోటు సమస్యను హైపోటెన్షన్ అంటారు. దీనివల్ల గుండె, మెదడు, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు ప్రభావితమవుతాయి. కాబట్టి రక్తపోటు అదుపులో ఉండేందుకు, తక్కువ రక్తపోటు సమస్యలు ఉన్నవారు ఈ కింది ఆహారాలను తీసుకోవాలి.



అవేంటో తెలుసుకుందాం..కాఫీ - మీరు ఎక్కువసేపు ఆహారం తినకపోతే, వెంటనే రక్తపోటు పడిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కాఫీ తాగాలి. ఎందుకంటే ఇందులో ఉండే కెఫిన్ రక్తపోటును సాధారణీకరిస్తుంది. ఉప్పు - తక్కువ రక్తపోటుతో బాధపడేవారు తప్పనిసరిగా ఉప్పు తినాలి. ఉప్పు కలిపిన నీరు త్రాగవచ్చు. నిమ్మకాయ రసంలో ఉప్పు కలిపి కూడా తాగొచ్చు. అలాగే శరీరంలో రక్తపోటును నియంత్రించడంలో బాదం సహాయపడుతుందని చాలా మందికి తెలియదు. రోజువారీ ఆహారంలో 4-5 బాదంపప్పులను చేర్చుకుంటే రక్తపోటు సక్రమంగా ఉంటుంది. బాదంపప్పును నానబెట్టి కూడా తినవచ్చు. ఎల్లప్పుడూ పుష్కలంగా నీరు తాగాలి. శరీర నిర్జలీకరణం రక్తపోటును తగ్గిస్తుంది. సాధారణంగా రోజుకు కనీసం 2-3 లీటర్ల నీరు త్రాగాలని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. సరిపడా నీళ్లు తాగడం వల్ల హైడ్రేటెడ్‌గా ఉండొచ్చు.

## గుండె సమస్యలు ఉన్నవారు నెయ్యి, వెన్న తినొచ్చా..?



ఒత్తిడితో కూడిన జీవనశైలి, ఫాస్ట్‌ఫుడ్, స్మోకింగ్, డ్రింకింగ్ కారణంగా ప్రజలు అధిక రక్తపోటు, పక్షవాతం, గుండె జబ్బుల సమస్యలను ఎదుర్కొంటున్నారు. వయస్సు మీదపడినవారిలో మాత్రమే కాదు యువతలో కూడా ఈ తరహా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. గుండె రోగులు తమ కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుకుంటే, ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు. మనం తినే ఆహారంలో పెద్ద మొత్తంలో కొవ్వు ఉంటే కొలెస్ట్రాల్ ప్రమాదాన్ని పెంచుతుంది. హృద్రోగులు నెయ్యి లేదా వెన్న తినడం తగ్గిస్తే బెటర్ అన్నది నిపుణుల వెర్షన్. ఎందుకంటే నెయ్యి లేదా వెన్నలో కొవ్వు అధికంగా ఉంటుంది. ఇది గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. చాలా మంది హృద్రోగులు తమ డైట్‌లో నెయ్యి లేదా వెన్న లేకుండా జాగ్రత్త పడతారు. ఈ విషయంలో నిపుణులు ఏం సలహాలు ఇస్తున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. హృద్రోగులు ఇంట్లో తయారుచేసిన వెన్న లేదా నెయ్యిని తక్కువ పరిమాణంలో తీసుకోవచ్చుట. అలానే జున్ను, బీన్స్, కూరగాయలు వంటి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలను తినొచ్చుట. చక్కెర, ఉప్పు అధికంగా ఉన్న ఆహారాన్ని అవొయిడ్ చేయడం బెటర్ అని చెబుతున్నారు. మీ ఆహారంలో తృణధాన్యాలు ఉండేలా చూసుకోవడం చాలా మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. అలాగే నీళ్లు ఎక్కువగా తాగాలి. సరైన సమయంలో ఆహారం తినడం, టైమ్ పడుకోవడం వంటి అలవాట్లు పాటించండి. అలాగే మద్యపానానికి దూరంగా ఉండటం మంచిది. రక్తపోటును క్రమం తప్పకుండా చెక్ చేసుకోండి..


## అరటిపండు, బొప్పాయి కలిపి తింటే అనారోగ్యానికి గురవుతారా..? ఇదిగో క్లారిటీ



మన ఆరోగ్యానికి పండ్లు చాలా అవసరం. పండ్ల ద్వారా ప్రొటీన్, ఫైబర్, పొటాషియం వంటి పోషకాలు శరీరానికి అందుతాయి. అందుకే డైలీ ఫ్రూట్స్ తినమని డాక్టర్లు చెబుతుంటారు. కొంతమంది వివిధ రకాల పండ్లను సలాడ్ రూపంలో తినడానికి ఇష్టపడతారు. అరటిపండు, బొప్పాయి కలిపి తినడాన్ని చాలామంది ఇష్టపడతారు. అయితే ఈ 2 ఫ్రూట్స్ తినడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను తెలుసుకుందాం పదండి.. అరటిపండు, బొప్పాయి కలిపి తింటే ఆరోగ్యానికి మంచిదా, చెడ్డదా అనే ప్రశ్నకు సమాధానం మన జీర్ణవ్యవస్థపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అరటి, బొప్పాయి రెండు విభిన్న స్వభావం కలిగిన పండ్లు కాబట్టి, వాటిని కలిపి తినడం వల్ల ఆరోగ్యంలో ఇబ్బందులు వస్తాయి. కాబట్టి ఇలా తినకపోవడమే మంచిదని అంటున్నారు. అరటిపండు, బొప్పాయి కలిపి తింటే వాంతులు, తలనొప్పి, వికారం, ఎసిడిటీ, గ్యాస్టిక్ ప్రాబ్లెమ్, అలర్జీ వంటి సమస్యలు వస్తాయట. ఉబ్బసం, ఇతర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఈ పండ్ల కాంబినేషన్ తినడం వల్ల సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉందట. బొప్పాయి, అరటిపండు కలిపి తింటే కడుపు నొప్పికి కూడా కారణం కావచ్చు. కాగా కామెర్లు బాధపడుతున్నవారు బొప్పాయి తినకూడదని కూడా డాక్టర్లు సలహా ఇస్తున్నారు. ఇందులోని పపైన్, బీటా కెరోటిన్ కామెర్లు సమస్యను పెంచుతుందని చెబుతున్నారు. ఇక శరీరంలో పొటాషియం అధిక స్థాయిలో ఉంటే అరటిపండ్లను తినకూడదు. ఇది శరీరంలో తీవ్రమైన సమస్యలకు దారి తీసే అవకాశం ఉంది.

## 30 దాటిన మహిళలు తప్పని సరిగా ఈ పరీక్షలు చేయించుకోవాలి.. వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది

మారిన జీవన విధానంతో కాలంతో పోటీ పడుతూ ఉరుకులు పరుగుల జీవితాన్ని గడపాల్సి వస్తుంది. బిజీ లైఫ్ స్టైల్ కారణంగా ప్రస్తుతం ఎక్కువ మంది తమ ఆరోగ్యాన్ని విస్మరిస్తున్నారు. ముఖ్యంగా పని చేసే మహిళలు తా హీరోగా పనిచేసే మహిళలపై పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఇంటి నుంచి ఆఫీస్ వరకు ప్రతిదానికీ బాధ్యత పురుషుల కంటే స్త్రీలపై కొంచెం అధికంగానే ఉంటుంది. అటువంటి పరిస్థితిలో స్త్రీ తన ఆరోగ్యాన్ని తాను సరిగ్గా చూసుకోలేకపోతుంది. చిన్న చిన్న అజాగ్రత్తలే అనేక పెద్ద ఇబ్బందులను కలిగిస్థాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం మహిళలు ఖచ్చితంగా 30 ఏళ్లు దాటిన తర్వాత ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. శరీరాన్ని పరీక్షించడం ద్వారా మధుమేహం, క్యాన్సర్ ,గుండె జబ్బులతో సహా అనేక ప్రమాద కర వ్యాధుల గురించి తెలుసుకోవచ్చు. అంతేకాదు ఇలా పరీక్షలు చేయించుకోవడం వలన ఏదైనా ప్రమాదకరమైన వ్యాధి లక్షణాలు కనిపిస్తే ప్రారంభ దశలోనే చికిత్స తీసుకుంటే ఆ వ్యాధి నిర్మూలించబడుతుడ్ని. ఈ నేపథ్యంలో 30 దాటిన మహిళలు ఎలాంటి ముఖ్యమైన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలో ఈ రోజు తెలుసుకుందాం. **క్యాన్సర్ పరీక్ష** : 35 ఏళ్లు వచ్చిన మహిళలు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ పరీక్షలను చేయించుకోవాలి. క్యాన్సర్ మొదటి దశలో బయటపడదు. కనుక మహిళలు తప్పనిసరిగా జన్యు పరీక్ష , పరీక్ష చేయించుకోవాలి. :కంప్లీట్ బ్లడ్ కౌంట్ అంటే పరీక్ష చేయించుకోవడం కూడా అవసరం. ఈ పరీక్ష సహాయంతో శరీరంలో ఇన్ఫెక్షన్, రక్తహీనత, హిమోగ్లోబిన్ సహా అనేక ఇతర వ్యాధులను గుర్తించవచ్చు. **థైరాయిడ్ పరీక్ష:** భారతదేశంలో థైరాయిడ్ రోగుల సంఖ్య నిరంతరం పెరుగుతోంది. మహిళలు 30 సంవత్సరాల వయస్సు దాటిన వెంటనే థైరాయిడ్ పరీక్ష చేయించుకోవాలి. థైరాయిడ్ లక్షణాలు హార్మోన్లలో మార్పులు, బరువు పెరగడం, క్రమరహిత పీరియడ్స్ వంటి సమస్యలను కలిగి ఉంటాయి. **లిపిడ్ ప్రొఫైల్ పరీక్ష:** జంక్ ఫుడ్, జీవనశైలిలో మార్పుల కారణంగా గుండె జబ్బులు కూడా పెరుగుతున్నాయి.కనుక లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్ చేయించుకోవాలి.ఈపరీక్ష సహాయంతో హైపర్ కొలెస్టెరోలేమియా, హైపర్ కార్డియోమయోపతి వంటి ప్రమాదకరమైన సమస్యలను సకాలంలో గుర్తించవచ్చు. **మధుమేహం:** మధుమేహ వ్యాధి కూడా వేగంగా పెరుగుతోంది. భారతదేశంలో80లక్షల మందికి పైగా మహిళలు బ్లడ్ షుగర్‌తోబాధపడుతున్నారు.అటువంటి పరిస్థితిలో,రక్తంలోగ్లూకోజ్‌స్థాయిలను పరీక్షించుకోండి.



Crime News ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

## కలస ప్రతిష్ట సందర్భంగా

# గణపతి పూజ




మండల కేంద్రమైన మాడుగుల బస్టాండ్ ఆవరణలో కొలువైన శ్రీదేవి అమ్మవారి ఆలయ నూతన కలస ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం అమ్మవారి ఆలయంలో సింహాచలం వేద పండితులు సుబ్రహ్మణ్య ఆధ్వర్యంలో గణపతి పూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో శ్రీనాథ్ శ్రీనివాసరావు దంపతులు తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కలస ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని రేపు గురువారం శ్రీదేవి ఆలయంలో శ్రీ చండీ మహా యాగాన్ని నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి

# ప్రారంభ పూజ



మాడుగుల మండలంలో కస్పా జగన్నాధపురం గ్రామంలో నేడు కూటమి ప్రభుత్వం సమక్షంలో విడుదలైన నిధులతో స్మశాన వాటిక వద్ద సిసి రోడ్ నిర్మాణానికి బుధవారం ప్రారంభం పూజా కార్యక్రమం లో గ్రామంలో ఉన్న కూటమి నాయకులందరూ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పుట్ట రాంబాబు పాలకుర్తి శ్రీనివాసరావు గ్రామ శాఖ అధ్యక్షులు రాపేట్టి జోగినాయుడు, మాడుగుల మండల క్లస్టర్ ఇంచార్జ్ శెట్టి విజయలక్ష్మి బిజెపి నాయకులు మద్దాల రమణ, ఆడారి బాబ్జి, మద్దాల ప్రసాద్, ఆడారి సన్యాసిరావు, కొట్యాడ రఘు, యల్లపు రాము,రాపెట్టి రాజశేఖర్, ఆడారి నారాయణ రావు. ఆడారి రమేష్ ,బొడ్డెడ వెంకట్రావు, భీశేట్టి రాజు, పొలమరశెట్టి సూరిబాబు,దాడి కోటీశ్వరరావు,కర్రీ మల్లికార్జున రావు, సుబ్బారావు పంతులు , రాంజీ, చిన్నం రాము, గంధురి కోతిశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## నర్సీపట్నం కోర్టు భవన విస్తరణకు

# రూ. 3.09 కోట్ల నిధులు మంజూరు

### స్పీకర్ అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా న్యాయ వ్యవస్థ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం భారీ నిధులను మంజూరు చేసింది. నర్సీపట్నంలోని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు భవనంపై రెండో అంతస్తు నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం రూ.3.9కోట్లు కేటాయిస్తూ జీవో నంబర్ 1889ను విడుదల చేసింది.

స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రత్యేక చొరవ చూపి, ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరపడం ద్వారా ఈ నిధుల మంజూరు సాధ్యమైంది. కోర్టు భవన విస్తరణ ద్వారా న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చిన స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి స్థానిక న్యాయవాద సంఘం, ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## చోడవరం జుత్తాడ గజపతినగరం

# అక్రమ ఇసుక రవాణాను ఆపండి

**సాక్షాత్తు తెలుగుదేశం పార్టీ నాయకుడే ఇసుక్కాసురుడి గా అవతారం**
**అధికార పార్టీ కి చెడ్డపేరు**
**తెలుగుదేశం పార్టీ పెద్దలే ఆగ్రహం**
**జుత్తాడ పిఏసిఎస్ అధ్యక్షుడు దొడ్డి రామారావు ఇసుకఅక్రమదారుడు**
**ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తున్నట్లు టిడిపి నాయుకులు**
**రోజు లక్షల రూపాయుల ఇసుక లారీలు ట్రాక్టర్ల తో అక్రమ రవాణా**
**స్థానిక శాసనసభ్యులు అండదండలు ఉన్నాయని చెప్పుకొస్తున్నారు**



అనకాపల్లి జిల్లా చోడవరం మండలం జుత్తాడ గ్రామం లో శారదా నది పరివాహక ప్రాంతం నుండి అక్రమంగా ఇసుక తరిలిపోతున్న సంబంధిత అధికారులు స్పందించక పోవడం తో ప్రజలకు పలు అనుమానాలు చోటు చేసుకుంటుంది. కాసులకు కక్కుర్తిపడి చూసి చూడనట్లు గా వ్యవహరిస్తున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణా ను గ్రామములో ఎవ్వరు అడ్డకుండా ఉండేందుకు గ్రామ పెద్దలకు 10 లక్షలు ఇచ్చినట్లు తెలిసింది.

సాక్షాత్తు తెలుగుదేశం పార్టీ నాయుకుడు పి ఏ సి ఎస్ అధ్యక్షుడు దొడ్డి రామారావు ఇసుక్కాసురుడి గా అవతారమెత్తి నిత్యం లక్షల్లో ట్రాక్టర్లతో లారీ లతో ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. పగలు ట్రాక్టర్లతో రాత్రుల్లు లారీల తో నగర ప్రాంతాలకు అక్రమ రవాణా జరుగుతుంది. అన్ని వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకొని ఇసుక వ్యాపారం కొనసాగుతూ మూడు పువ్వులు ఆరు కాయులుగా విరాజిమ్ముతున్నాయి. స్థానిక శాసన సభ్యుల పేరును వాడుకుంటూ మండల,జిల్లా అధికార యంత్రాంగని గుప్పెట్లో పెట్టుకున్నట్లు విశ్వసనీయముగా తెలిసింది. మండలములో గవరవరం లక్కవరం భోగాపురం గౌరీపట్నం జుత్తాడ, గజపతినగరం రాయపురాజుపేట ఇసుక అక్రమరవాణా కోట్లరూపాయలు ప్రైవేటువ్యక్తుల ఖాతాల్లోకి జమ అవుతున్న పట్టించుకోనే నాధుడు కరువైయాడు. దీనితో పాటు గ్రావెల్ కూడా రాత్రుల్లు గోవాడ వెంకన్నపాలెం, నర్సాపురం అడ్డురు నుండి రోజు వందల్లో లారీలతో రవాణా జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వములో ఉంటూ కంచె చేను మేసినట్లుగా వున్నదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారిణి,మైన్స్ శాఖ పోలీస్ నీటి పారుదల శాఖ అధికారులు జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రజలు మేధావులు ప్రతిపక్ష పార్టీ నాయుకులు కోరుతున్నారు.



# నాతవరంలో జనసేన ఉద్యమి కార్యక్రమం



బుధవారం జనసేన పార్టీ నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ ఆధ్వర్యంలో నాతవరం మండల కేంద్రంలో జనసేన ఉద్యమి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి, వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమంకు నియోజకవర్గంలో విశేష స్పందన వస్తుందన్నారు. స్వచ్ఛందంగా ప్రజలు జనసేన పార్టీలో భాగస్వాములు అవుతూ సభ్యత్వాలను నమోదు చేసుకుంటున్నారని చెప్పారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని లక్ష్యంగా పెట్టుకుని జనసేన సభ్యత్వ డ్రైవ్ నిర్వహిస్తుందన్నారు.

క్రియాశీలక సభ్యత్వ రుసుము 500 నుంచి 400కు తగ్గించిందని చెప్పారు. సభ్యత్వ రుసుమును కార్యకర్తల సంక్షేమం, ఇన్సూరెన్స్ కోసం వినియోగిస్తుందని అన్నారు. సభ్యులకు రూ. 5 లక్షల ప్రమాద భీమా సదుపాయం కల్పిస్తుందని, శాశ్వత వైకల్యం కలిగితే 2 లక్షల భీమా, ప్రమాదానికి గురైతే రూ. 50 వేల భీమా సాయం అందించేలా జనసేన ముందుకు సాగుతుందని వివరించారు. సభ్యత్వాన్ని మూడు వర్గాలుగా జనసేన పార్టీ విభజించిందని, ఉద్యమి, సాధక్, ప్రదాతగా సభ్యుల వర్గీకరణ చేసిందని, పార్టీ సిద్ధాంతాల ప్రచారం, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు బడ్డు సూరిశేఖర్, మాకిరెడ్డి వెంకటరమణ, గుడివాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 6న సమగ్ర శిక్ష ఉద్యోగుల ఛలో విజయవాడ




సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 6న నిర్వహించనున్న ఛలో విజయవాడ కార్యక్రమంకు సంబంధించి మాస్ లీవ్ మంజూరు చేయాలని బుధవారం నాతవరం సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంఇఒ బ్రహ్మాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల నాతవరం మండల అధ్యక్షులు ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష పథకంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు, సేవా నిబంధనలు, క్రమబద్ధీకరణ, కనీస టైమ్ స్కేల్ అమలు, హెచ్ఆర్ పాలసీ రూపకల్పన, ఉద్యోగ భద్రత, సంక్షేమ సౌకర్యాల వంటి కీలక అంశాలపై జేఏసీ రాష్ట్ర కమిటీ పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చిందన్నారు.

2025 డిసెంబరు నెలలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను ప్రభుత్వంతో చర్చల నేపథ్యంలో వాయిదా వేశామని, దీంతో గత ఏడాది నవంబర్ 4, డిసెంబరు 19న రెండు దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ ఎలాంటి స్పష్టమైన పురోగతి కనిపించలేదన్నారు. ముఖ్యంగా నాన్ ఫైనాన్స్ సమస్యలు(సేవా నిబంధనలు, హెచ్ఆర్ పాలసీ, విధుల భద్రత తదితర అంశాలు) కూడా పరిష్కారం కాలేదని చెప్పారు. దీని వల్ల ఉద్యోగుల్లో తీవ్ర నిరాశ నెలకొందని వాపోయారు. ఇటీవల అసెంబ్లీలో జరిగిన చర్చల నేపథ్యంలో కూడా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై స్పష్టత రాకపోవడంతో ఉద్యోగుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణార్ధం ఈ నెల 6న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమం శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించడం జరుగుతుందని, సమగ్ర శిక్ష పథక అభివృద్ధి, విద్యావ్యవస్థ బలోపేతం, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎం.సాంబమూర్తి, జి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ బాలికల వసతి గృహంలో అవగాహన కార్యక్రమం




మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా టౌన్ పోలీసులు శివపురం ఎస్టి బాలికల వసతి గృహంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ షేక్ గఫూర్ డయల్ 112 అత్యవసర సేవలు, షీ టీమ్స్, శక్తి యాప్, మహిళల రక్షణకు అవసరమైన చట్టాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి వేధింపులు లేదా సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ ఉమామామహేశ్వరరావు పాల్గొన్నారు.

# డి.ఎర్రవరం పాఠశాలలో స్వీయరక్షణపై విద్యార్థినీలకు శిక్షణ



అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్. రేవతమ్మ, నాతవరం ఎస్సై వై.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని డీ. యర్రవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీలకు స్వీయరక్షణ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సైలు మాట్లాడుతూ ప్రాథమిక స్వీయరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థినీలలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. ఆపద సమయంలో ధైర్యంగా ఎదుర్కోనేందుకు ఇటువంటి శిక్షణలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, శక్తి టీమ్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మాజీ సీఎం జగన్‌తో భేటి అయిన మాజీ ఎమ్మెల్యే గణేష్



వైసీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైయస్.జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మంగళవారం నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ కమిటీ నిర్మాణంలో రాష్ట్రంలోనే నర్సీపట్నం తొలిస్థానంలో ఉండటంతో ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ హార్షవర్ధన్ రెడ్డితో పాటు నర్సీపట్నం నియోజకవర్గం మండల పార్టీ అధ్యక్షులతో కలిసి భేటి అయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ కమిటీ నిర్మాణంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండటంపై వైయస్.జగన్ మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో పని చేయాలని, త్వరలో నర్సీపట్నం నియోజకవర్గం పార్టీ నాయకులు అందరితో ఒక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వైయస్.జగన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ వైసీపీ అధ్యక్షులు ఏకా శివ, నర్సీపట్నం మండల అధ్యక్షులు శానాపతి వెంకటరత్నం, గొలుగొండ మండల అధ్యక్షులు పాణి శాంతారావు, నాతవరం మండల అధ్యక్షులు లగుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఒమన్, కువైట్ నేతలతో మాట్లాడిన మోదీ

**దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం ఒమన్ అధినేత సుల్తాన్ హైతం బిన్ తారిక్, కువైట్ యువరాజు షేక్ సబా అల్ ఖాలెద్ అల్ హమద్ అల్ ముబారక్ అల్‌సబా, ఖతార్ పాలకుడు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానిలతో మాట్లాడారు. ఆయా దేశాలపై దాడులు జరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా దేశాల సార్వభౌమాధికారానికి, ప్రాంతీయ సమగ్రతకు భంగం కలిగించడాన్ని ఆయన ఖండించారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీయుల యోగక్షేమాలను గురించి నేతల్ని అడిగి తెలుసుకున్నారు. గడచిన రెండు రోజుల్లో మోదీ మొత్తం ఎనిమిది పశ్చిమాసియా దేశాల అధినేతలతో మాట్లాడారు.**

## భారతీయుల శ్రేయస్సే ముఖ్యం

పశ్చిమాసియా వివాదం ముదురుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో నివసిస్తున్న కోటి మంది భారతీయుల శ్రేయస్సు తనకు అత్యంత ప్రధానమని భారత్ నొక్కి చెప్పింది. యుద్ధ నేపథ్యంలో ఇంధన సరఫరాకు కలుగుతున్న అంతరాయం భారత ఆర్థికంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇజ్రాయెల్, అమెరికాలు ఇరాన్‌పై సంయుక్త దాడిని చేపట్టిన నేపథ్యంలో ఇరు పక్షాలూ దౌత్యానికి, సంప్రదింపులకు అవకాశం ఇవ్వాలని మరోసారి ఆకాంక్షించింది.



## పశ్చిమాసియా కోసం ప్రత్యేక బృందం

పశ్చిమాసియా పరిణామాలను నిరంతరం గమనిస్తూ నౌకాయానం, సరకు రవాణా, ఎగుమతులు, కీలక దిగుమతుల రంగాల్లో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల సభ్యులతో కూడుకున్న ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. యుద్ధ నేపథ్యంలో నౌకా మార్గాలకు అంతరాయం కలిగి రవాణా వ్యయం విపరీతంగా పెరిగే అవకాశం ఉందని, బీమా ప్రీమియం కూడా భారీగా పెరుగుతుందని ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ బృందాన్ని ఏర్పాటు చేశారు. బృందం తొలిసారి మంగళవారం సమావేశమైందని, అనేక విషయాలపై విస్పష్టమైన సలహాలిచ్చిందని గోయల్ చెప్పారు. మరోవైపు ఎగుమతి, దిగుమతిదారుల కోసం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ కార్యాలయంలో ఒక సహాయ వేదికను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ అన్నారు. అరబ్బు ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు ఉద్రిక్తతలు ఎగబాకితే బాబ్-ఎల్- మాండెబ్, ఎర్ర సముద్రం, సూయెజ్ కెనాల్‌ల మీదుగా సరకు రవాణాపై ప్రతికూల ప్రభావం పడుతుందని దిగుమతిదారులు, ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్షియన్ అగాథంలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్‌లో నివసిస్తున్న తమ పౌరులు అప్రమత్తంగా ఉండాలని, వీలైనంత వరకూ ఇంట్లోనే ఉంటూ అవసరమైతేనే బయటికి రావాలని భారత ప్రభుత్వం హెచ్చరిక జారీ చేసింది.

Crime News

ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

# సఫారీలకు అదృష్టం.. కివీస్‌కు టెన్షన్..

## సెమీస్‌కు వర్షం పడితే ఫైనల్ చేరేది ఆ జట్టే

**టీ20 ప్రపంచకప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. కోల్‌కతాలోని ప్రతిష్టాత్మక ఈడెన్ గార్డెన్స్ వేదికగా బుధవారం (మార్చి 4) సౌతాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి సెమీఫైనల్ పోరు జరగనుంది. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఓటమనేదే ఎరుగకుండా దూసుకుపోతున్న సౌతాఫ్రికా ఫుల్ ఫామ్‌లో ఉండగా.. కివీస్ జట్టు ఎలాగైనా ఫైనల్ చేరాలని పట్టుదలతో ఉంది.**




టీ20 ప్రపంచకప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. కోల్‌కతాలోని ప్రతిష్టాత్మక ఈడెన్ గార్డెన్స్ వేదికగా బుధవారం (మార్చి 4) సౌతాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి సెమీఫైనల్ పోరు జరగనుంది. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఓటమనేదే ఎరుగకుండా దూసుకుపోతున్న సౌతాఫ్రికా ఫుల్ ఫామ్‌లో ఉండగా.. కివీస్ జట్టు ఎలాగైనా ఫైనల్ చేరాలని పట్టుదలతో ఉంది. అయితే, ఈ కీలక మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉందనే వార్తలు అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒకవేళ వరుణుడు ఆటంకం కలిగిస్తే ఏ జట్టు ఫైనల్ చేరుతుంది? ఐసీసీ నిబంధనలు ఏం చెబుతున్నాయి? అనే విషయాలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి.

ఈ మెగా టోర్నీలో సౌతాఫ్రికా ప్రస్థానం అప్రహతితంగా సాగుతోంది. గ్రూప్ స్టేజ్ నుంచి సూపర్-8 వరకు అన్ని మ్యాచ్‌లను గెలిచిన ప్రోటీస్ జట్టు.. భారత్ వంటి బలమైన జట్టును కూడా ఓడించి సెమీస్‌కు దూసుకొచ్చింది. మరోవైపు న్యూజిలాండ్ ప్రయాణం కాస్త ఒడిదుడుకులతో సాగింది. గ్రూప్ స్టేజ్‌లో సౌతాఫ్రికా చేతిలోనే కివీస్ ఓడిపోయింది. ఇక సూపర్ 8లో శ్రీలంకపై గెలిచినా, ఇంగ్లాండ్ చేతిలో ఓటమి పాలైంది. పాకిస్థాన్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం వల్ల రద్దు కావడంతో కేవలం మూడు పాయింట్లతోనే కివీస్ సెమీస్‌లో అడుగుపెట్టింది.

ఐసీసీ నిబంధనల ప్రకారం.. సెమీఫైనల్ మ్యాచ్‌లకు అదనపు సమయంతో పాటు రిజర్వ్ డే సౌకర్యం కూడా ఉంది. బుధవారం గనుక మ్యాచ్‌కు వర్షం పడితే, అధికారులకు 90 నిమిషాల అదనపు సమయం ఉంటుంది. ఒకవేళ ఆ రోజు ఆట సాధ్యం కాకపోతే, గురువారం (మార్చి 5) రిజర్వ్ డే రోజున మ్యాచ్ ఎక్కడ ఆగిందో అక్కడి నుంచే మళ్ళీ మొదలవుతుంది. అయితే దురదృష్టవశాత్తూ రిజర్వ్ డే నాడు కూడా వర్షం పడి ఆట పూర్తిగా రద్దయితే మాత్రం విజేతను నిర్ణయించడానికి టాస్ వేయడం గానీ, బౌల్ అవుట్ నిర్వహించడం గానీ చేయరు.

సూపర్-8 పాయింట్ల పట్టిక ఆధారంగానే ఫైనలిస్టును నిర్ణయిస్తారు. సౌతాఫ్రికా తన సూపర్-8 గ్రూప్‌లో 6 పాయింట్లతో టాపర్‌గా నిలవగా.. న్యూజిలాండ్ తన గ్రూప్‌లో కేవలం 3 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. కాబట్టి వర్షం వల్ల సెమీఫైనల్ రద్దయితే నిబంధనల ప్రకారం సౌతాఫ్రికా నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఇప్పటికే చోకర్స్ ముద్రతో ఇబ్బంది పడుతున్న ప్రోటీస్ జట్టుకు ఈసారి అదృష్టం కలిసొచ్చేలా కనిపిస్తోంది. మరి ఈడెన్ గార్డెన్స్‌లో వరుణుడు శాంతిస్తాడా లేదా అన్నది వేచి చూడాలి.

# చిన్నస్వామి గడ్డపై మళ్ళీ కోహ్లీ గర్జన..

## ఆర్‌సీబీ ఫ్యాన్స్‌కు పండుగే పండుగ

**ఐపీఎల్ 2026 సీజన్ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులకు ఒక తీపి కబురు, ఒక చేదు కబురు అందింది. గతేడాది ఐపీఎల్ 2025 విజేతలుగా నిలిచిన డిఫెండింగ్ ఛాంపియన్స్ ఆర్‌సీబీ, మళ్ళీ తమ సొంత గడ్డ అయిన చిన్నస్వామి స్టేడియంలోకి అడుగుపెట్టబోతున్నారు.**




ఐపీఎల్ 2026 సీజన్ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులకు ఒక తీపి కబురు, ఒక చేదు కబురు అందింది. గతేడాది ఐపీఎల్ 2025 విజేతలుగా నిలిచిన డిఫెండింగ్ ఛాంపియన్స్ ఆర్‌సీబీ, మళ్ళీ తమ సొంత గడ్డ అయిన చిన్నస్వామి స్టేడియంలోకి అడుగుపెట్టబోతున్నారు. అయితే ఈసారి హోమ్ గ్రౌండ్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం మాత్రం దక్కలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్‌సీబీ తన ఏడు హోమ్ మ్యాచ్‌లలో కేవలం ఐదు మ్యాచ్‌లను మాత్రమే బెంగళూరులో ఆడనుంది. మిగిలిన రెండు మ్యాచ్‌లను రాయ్‌పూర్?లోని షహీద్ వీర్ నారాయణ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించింది.

నిజానికి చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు జరుగుతాయా లేదా అన్నదానిపై గత కొన్ని నెలలుగా పెద్ద ఎత్తున సస్పెన్స్ నెలకొంది. దీనికి కారణం గతేడాది జరిగిన ఒక విషాద ఘటన. ఐపీఎల్ 2025లో ఆర్‌సీబీ తొలిసారి టైటిల్ గెలిచిన ఆనందంలో అభిమానులు భారీగా తరలిరావడంతో చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ దుర్ఘటన తర్వాత కర్ణాటక ప్రభుత్వం అక్కడ భద్రతాపరమైన కారణాల దృష్ట్యా ఎటువంటి మేజర్ క్రికెట్ మ్యాచ్‌లకు అనుమతి ఇవ్వలేదు. రంజీ ట్రోఫీ, మహారాజా ట్రోఫీ వంటి టోర్నీలు కూడా ఇక్కడ జరగలేదు.

చివరికి కర్ణాటక ప్రభుత్వం, కేఎస్‌సీఏ, పోలీస్ యంత్రాంగంతో ఆర్‌సీబీ యాజమాన్యం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. స్టేడియంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవడంతో ఐదు మ్యాచ్‌లకు గ్రీన్ సిగ్నల్ లభించింది. "చిన్నస్వామి స్టేడియం కేవలం గ్రౌండ్ మాత్రమే కాదు, అది మా జట్టు గుర్తింపు. ఆర్‌సీబీ ఫ్యాన్స్ అందించే ఎనర్జీ ఆటగాళ్లకు కొండంత బలం. అందుకే మా అభిమానుల కోసం ఇక్కడ మ్యాచ్‌లు నిర్వహించడం చాలా ముఖ్యం" అని ఆర్‌సీబీ సీఈఓ రాజేష్ మీనన్ ఆనందం వ్యక్తం చేశారు.

మిగిలిన రెండు మ్యాచ్‌లను రాయ్‌పూర్‌లో ఆడటం వెనుక ముందస్తు ఒప్పందాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాయ్‌పూర్ స్టేడియం కూడా ఆర్‌సీబీకి రెండో హోమ్ గ్రౌండ్‌లా మారనుంది. విరాట్ కోహ్లీ మళ్ళీ చిన్నస్వామి స్టేడియంలోని గ్యాలరీల ముందు కింగ్?లా గర్జించే క్షణాల కోసం బెంగళూరు క్రికెట్ ప్రేమికులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. టైటిల్ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆర్‌సీబీ ఈసారి బెంగళూరు గడ్డపై ఎలాంటి అద్భుతాలు చేస్తుందో చూడాలి.

# ఇంగ్లాండ్‌తో సెమీస్.. టీమిండియాకు

## గవాస్కర్ సీరియస్ వార్నింగ్.. ఏం జరిగిందంటే ?

**టీ20 ప్రపంచకప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. మార్చి 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగనున్న సెమీఫైనల్ పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ టీమిండియాను హెచ్చరించారు.**

టీ20 ప్రపంచకప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. మార్చి 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగనున్న సెమీఫైనల్ పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ టీమిండియాను హెచ్చరించారు. ఇంగ్లాండ్ జట్టులో ఉన్న ఒక ప్రమాదకరమైన ఆటగాడి గురించి గవాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ రూపంలో భారత్‌కు గట్టి ముప్పు పొంచి ఉందని ఆయన విశ్లేషించారు.




ప్రస్తుత టోర్నీలో విల్ జాక్స్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటివరకు ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో నాలుగు సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను గెలుచుకోవడం అతని ఆధిపత్యానికి నిదర్శనం. బ్యాటింగ్‌లో 191 పరుగులు చేయడమే కాకుండా, బౌలింగ్‌లోనూ 7 వికెట్లు పడగొట్టి ఇంగ్లాండ్ సెమీస్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. "పిచ్ గనుక కాస్త టర్న్ అయితే విల్ జాక్స్‌ను ఎదుర్కోవడం భారత బ్యాటర్లకు సవాలుగా మారుతుంది. ముఖ్యంగా సంజు శాంసన్, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా వంటి రైట్ హ్యాండ్ బ్యాటర్లు అతన్ని ఎలా ఎదుర్కొంటారనే దానిపైనే మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంటుంది" అని గవాస్కర్ అభిప్రాయపడ్డారు.

ఇంగ్లాండ్ జట్టులో విల్ జాక్స్ ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు రావడం ఆ జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్ అని గవాస్కర్ పేర్కొన్నారు. మన జట్టులో శివమ్ దూబే ఎలాగైతే మ్యాచ్ స్వరూపాన్ని మార్చేస్తాడో, ఇంగ్లాండ్‌కు విల్ జాక్స్ కూడా అలాగేనని ఆయన పోల్చారు. వెస్టిండీస్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ తరహాలోనే ఇంగ్లాండ్‌తో మ్యాచ్ కూడా అత్యంత ఉత్కంఠభరితంగా సాగుతుందని గవాస్కర్ జోస్యం చెప్పారు. రెండు జట్లు కూడా బ్యాటింగ్, బౌలింగ్ మరియు అనుభవంలో సమానంగా ఉన్నాయని, ఎవరు ఒత్తిడిని జయిస్తే వారే ఫైనల్ చేరుతారని ఆయన స్పష్టం చేశారు.

ముఖ్యంగా భారత లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లైన అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, శివమ్ దూబేలకు విల్ జాక్స్ బౌలింగ్ వేసే అవకాశం తక్కువని, కాబట్టి రైట్ హ్యాండ్ బ్యాటర్లే బాధ్యత తీసుకోవాలని గవాస్కర్ సూచించారు. ముంబై పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది, కానీ ఒత్తిడి ఉన్న సమయంలో స్పిన్నర్లు కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. మరి గవాస్కర్ హెచ్చరించినట్లుగా విల్ జాక్స్ భరతం పట్టి టీమిండియా ఫైనల్‌కు దూసుకెళ్తుందో లేదో చూడాలి.

# టీమిండియాలో వాడే యమ డేంజర్..

## ఆ ఒక్కడి కోసం బ్రహ్మాస్త్రం సిద్ధం చేశాం

టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌లో ఇండియా, ఇంగ్లాండ్ తలపడనున్నాయి. ముంబై వాంఖడే స్టేడియం వేదికగా జరిగే ఈ మ్యాచ్‌పై ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. టీమిండియాకు మర్చిపోలేని ఓటమి తప్పదని హెచ్చరించాడు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఓ సారి చూసేయండి. టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠగా ప్రారంభం కానున్నాయి. తొలి సెమీఫైనల్‌లో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా తలపడనుండగా, రేపు ముంబైలోని చారిత్రాత్మక వాంఖడే స్టేడియం వేదికగా ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య రెండో సెమీఫైనల్ జరగనుంది. ఈ కీలక పోరు ముందు ఇంగ్లాండ్ స్టార్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ భారత జట్టుకు గట్టి హెచ్చరికలు జారీ చేశాడు. వాంఖడే స్టేడియానికి లక్షలాది మంది భారత అభిమానులు తరలివస్తారని పేర్కొన్న సామ్ కరన్.. వారిని సైలెంట్ చేసేందుకు తమ దగ్గర ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించాడు. "ఇండియాను ఓడిస్తేనే వారు గమ్మున కూర్చుంటారని" వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు. అంతేకాకుండా, క్రికెట్ చరిత్రలో టీమిండియాకు మర్చిపోలేని ఓటమి తప్పదని తీవ్రంగా హెచ్చరించాడు. తమ జట్టు సెమీఫైనల్‌లో ఇండియాపై ఖచ్చితంగా విజయం సాధిస్తుందని అతడు ధీమా వ్యక్తం చేశాడు. బ్యాటింగ్ విషయానికి వస్తే.. యువ సంచలనం అభిషేక్ శర్మ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తాడని కరన్ అంగీకరించాడు. అయితే, అతన్ని త్వరగా ఔట్ చేయడానికి తమ దగ్గర "రామబాణం" ఉందని సంచలన వ్యాఖ్యలు చేశాడు. అభిషేక్ శర్మ ప్రస్తుత ఫామ్‌లో లేకపోయినప్పటికీ, ఇంగ్లాండ్ జట్టు అతని గురించి ఆందోళన చెందుతోంది. ఈ టీ20 ప్రపంచకప్‌కు ముందు అతను సృష్టించిన విధ్వంసం అలాంటిది కావడం గమనార్హం. తమ జట్టుపై అతను మరోసారి రెచ్చిపోతాడేమోనన్న భయం ఇంగ్లాండ్ జట్టులో ఇంకా కొనసాగుతుందని కరన్ వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. ఈ సెమీఫైనల్ నేపథ్యంలో టీమిండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య గత రికార్డులు చర్చనీయాంశంగా మారాయి. ICC టీ20 ప్రపంచకప్ టోర్నమెంట్లలో ఈ రెండు జట్లు ఇప్పటివరకు మొత్తం ఐదు మ్యాచ్‌లలో తలపడ్డాయి.

# సెమీస్‌లో గెలిచి ఫైనల్‌కు వెళ్తే.. టీమిండియాకు శనిలా అతిపెద్ద రెండు గండాలు

**2026 టీ20 ప్రపంచకప్ నాకౌట్ దశ ప్రారంభమైంది. భారత్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఇంగ్లాండ్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. భారత్ ఫైనల్‌కు అర్హత సాధిస్తే, రెండు పెద్ద సవాళ్లు ఎదురవుతాయి. ఒకటి దక్షిణాఫ్రికా, మరొకటి అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం పిచ్. ఈ రెండు గండాలను టీమిండియా ఎలా అధిగమిస్తుందో చూడాలి.**




2026 టీ20 ప్రపంచకప్ ఉత్కంఠభరితమైన నాకౌట్ దశ ఇప్పుడు ప్రారంభమైంది. అన్ని గ్రూప్‌లలో అజేయంగా నిలిచిన జట్లు ఇప్పటికే సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. భారత్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఇంగ్లాండ్ జట్లు తుది సమరానికి ఒక అడుగు దూరంలో ఉన్నాయి. ఈ టోర్నమెంట్‌లో తొలి సెమీఫైనల్ మ్యాచ్ కోల్‌కతాలోని ప్రతిష్టాత్మకమైన ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. ఆ మరుసటి రోజు, రెండో సెమీఫైనల్ మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ మధ్య జరుగుతుంది. ఈ మ్యాచ్ ద్వారా మరో ఫైనలిస్ట్‌ను నిర్ణయిస్తారు . టీమిండియా తన సెమీఫైనల్ ప్రత్యర్థి ఇంగ్లాండ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంటే, వారికి తప్పించుకోలేని రెండు అతి పెద్ద సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ సవాళ్లు టీమిండియా ప్రపంచకప్ కలను నిజం చేసుకోవడంలో గణనీయమైన అడ్డంకులుగా మారవచ్చు. మొదటి సవాల్ దక్షిణాఫ్రికా జట్టు. తొలి సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి దక్షిణాఫ్రికా ఫైనల్‌కు చేరుకుంటే, అది టీమిండియాకు పెద్ద ముప్పుగా మారుతుంది. 2024లో జరిగిన ఒక ఫైనల్‌లో టీమిండియాను ఓడించేంత పని చేసిన దక్షిణాఫ్రికా, ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవడానికి సంసిద్ధంగా ఉంది. ఈ టీ20 ప్రపంచకప్‌లో సూపర్ 8 దశలో కూడా టీమిండియాను దక్షిణాఫ్రికా ఓడించింది. ఫైనల్‌లో మరోసారి దక్షిణాఫ్రికాను ఎదుర్కోవాలంటే టీమిండియాకు కష్టంగా మారవచ్చు. ఎందుకంటే గత విజయాలు, ప్రస్తుత ఫామ్ వారికి అనుకూలంగా ఉన్నాయి. రెండో సవాల్ ఫైనల్ మ్యాచ్ వేదికకు సంబంధించినది. ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరుగుతుందని తెలిస్తే టీమిండియాకే కాదు, అభిమానులకు కూడా షాక్ అవుతుంది. ఈ పిచ్ టీమిండియాకు అచ్చిరాదని గత రికార్డులు సూచిస్తున్నాయి. 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో ఇదే స్టేడియంలో టీమిండియా ఆస్ట్రేలియా చేతిలో ఘోరంగా ఓడిపోయింది. ఇది ఒక పెద్ద షాక్. ఈ టీ20 ప్రపంచకప్‌లో కూడా సూపర్ 8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి పాలైంది. మళ్ళీ అచ్చిరాని ఇదే గ్రౌండ్‌లో అదే దక్షిణాఫ్రికాతో ఫైనల్‌లో తలపడటం టీమిండియాకు కలిసి వస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అహ్మదాబాద్ పిచ్ ప్రత్యేకంగా దక్షిణాఫ్రికాకు అనుకూలంగా ఉంది. ఈ టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా ఇప్పటికే ఈ గ్రౌండ్‌లో నాలుగు మ్యాచ్‌లు ఆడి అన్నింటిలోనూ విజయం సాధించింది. అంటే, ఈ అహ్మదాబాద్ గ్రౌండ్ టీమిండియా కంటే దక్షిణాఫ్రికాకు ఒక హోమ్ గ్రౌండ్‌గా మారిపోయింది.

# సినిమా స్కోప్


## కృత్రిమ..భామ!

- అందుబాటులోకి ai హీరోయిన్
- సినీ రంగానికి షాక్
- నటనలోనే మేటి
- రీల్, రియల్ హీరోయిన్లకు కష్టాలే



భారతీయ బుల్లితెర చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. సాంకేతిక పరిజ్ఞానం అంచుల ను తాకుతూ.. మనుషులకు దీటుగా నటించేందుకు నైనా ఏవీటీఆర్ అనే ఏఐ బ్యూటీ సిద్ధమైపోయింది. ఇప్పటికే నైనా నటించిన కొన్ని వీడియోలు, డ్యాన్స్ వీడియోలు, మోడలింగ్ అసైన్ మెంట్లకు సంబంధించిన ఇన్ స్టా వీడియోలు ఇంటర్నెట్ ని కుదిపేస్తున్నాయి.
ఇప్పటికే ఆర్జీవీ, కమల్ హాసన్ లాంటి అడ్వాన్స్ డ్ ... ప్రముఖులు కృత్రిమ మేథస్సును ... చేయడంపై దృష్టి సారించారు. ఆర్జీవీ రీసెర్చ్ ప్రకారం.. భవిష్యత్‌లో సినిమా ఇండస్ట్రీలో ఎవరికీ పని ఉండదు...క్రియేటర్లు ఎవరి పని వారే చేసుకోవచ్చు. తన క్రియేటివిటీ తన ఐడియాలజీ తన అభిరుచి ప్రకారం.. ఒక సినిమాని సాంకేతికతను ఉపయోగించి తయారు చేయొచ్చని వర్మ విశ్లేషిస్తున్నారు. పరిమిత కాస్టింగ్.. పరిమిత క్రూతో చాలా సినిమాలను రూపొందించేందుకు కృత్రిమ మేథస్సు అవకాశం కల్పిస్తుందని చెబుతున్నారు. ఇప్పుడు ఏకంగా మొట్టమొదటి ఏఐ హీరోయిన్ పుట్టుకు రావడం కలకలం రేపుతోంది. నైనా ఏవీటీఆర్ ఇప్పుడు తాజా సెన్సేషన్. ఈ ఏఐ బ్యూటీ కిల్లింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాను, బుల్లితెరను షేక్ చేస్తోంది. కేవలం మనుషులు మాత్రమే నటించగలరనే భావనను చెరిపివేస్తూ.. ఈ ఏఐ సుందరి తన కిల్లర్ మూవ్స్‌తో ప్రేక్షకుల మతి పోగొడుతోంది.

దీనిని నిశితంగా గమనిస్తే... నైనా కేవలం ఒక యానిమేషన్ బొమ్మ మాత్రమే కాదు.. అత్యంత అధునాతనమైన మెషిన్ లెర్నింగ్ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీల మేళవింపుతో సృష్టించిన ఒక అద్భుత దృశ్య కావ్యం. ఈ సరికొత్త టెక్నాలజీ వల్ల నైనా అనే పాత్రధారి కదలికలు, ప్రవర్తన అచ్చం నిజమైన నటిని తలపిస్తూ ప్రేక్షకులను మాయ చేస్తున్నాయి. నైనాను ఇంత రియలిస్టిక్‌గా చూపించడం వెనుక హైఎండ్ గ్రాఫిక్స్ రెండరింగ్ సాంకేతికత కీలక పాత్ర పోషించింది. ఆమె చర్మం రంగు, జుట్టు గాలికి ఊగే విధానం, కళ్లలోని సహజమైన మెరుపును గమనిస్తే ఈ బ్యూటీ ఒక వర్చువల్ క్యారెక్టర్ అని నమ్మడం కష్టంగా ఉంది. సాధారణ ఏఐ బొమ్మల్లో ముఖ కవళికలు కృత్రిమంగా, బిగుతుగా ఉంటాయి. కానీ నైనా విషయంలో కోపం, సంతోషం, బాధ వంటి సున్నితమైన ఎమోషన్లను పలికించిన తీరు ఆశ్చర్యపరుస్తోంది. ఈ ఎమోషన్స్ ని పలికించడం కోసం సుమారు 50కి పైగా ఫేషియల్ మ్యాపింగ్ పాయింట్స్ ను వాడారు. అందుకే ఆమె పలికించే హావభావాలు ఆ కిల్లింగ్ లుక్స్ ప్రేక్షకులకు చాలా సహజంగా అనిపిస్తున్నాయి.




## రై రై సాంగ్ రయ్ రయ్!

- రామ్ చరణ్ సరికొత్త రికార్డ్
- పెద్ది రైరై పాట సంచలనం
- 24 గంటల్లో 46.1మిలియన్ వ్యూస్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న 'పెద్ది' సినిమా కంప్లీట్ మాస్ అండ్ రస్టిక్ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోంది. . ఇప్పటికే విడుదలైన మొదటి పాట 'చికిరీ చికిరి' చార్ట్‌బస్టర్‌గా నిలిచి సినిమాపై మంచి పాజిటివ్ వైబ్ క్రియేట్ చేసింది. ఇక లేటెస్ట్ గా వచ్చిన రెండో సింగిల్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. 'రై రై రా రా' సాంగ్ విడుదలైన మొదటి గంట నుంచే సరికొత్త రికార్డులను తిరగరాస్తోంది. ఏఆర్ రెహమాన్ తనదైన స్టైల్‌లో అదిరిపోయే మాస్ బీట్ ఇవ్వడమే కాకుండా, స్వయంగా పాడటం ఈ పాటకు పెద్ద ప్లస్ పాయింట్. అనంత శ్రీరామ్ రాసిన పవర్‌ఫుల్ లిరిక్స్ కథలోని ఇంటెన్సిటీని చూపిస్తున్నాయి. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో చరణ్ వేసిన స్టెప్పులు నెట్టింట వైరల్ అవుతున్నాయి. రికార్డుల విషయానికి వస్తే, 'రై రై రా రా' కేవలం 24 గంటల్లోనే సౌత్ ఇండియా లెవల్‌లో ఆల్ టైమ్ రికార్డులను బద్దలు కొట్టింది. ఐదు భాషల్లో కలిపి ఈ పాట ఏకంగా 46.1 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి హిస్టరీ క్రియేట్ చేసింది. ఒక్క తెలుగులోనే 29.21 మిలియన్ల వ్యూస్ రాబట్టి, అంతకుముందు 'చికిరీ చికిరి' పేరిట ఉన్న 29.1 మిలియన్ల రికార్డును ఇది దాటేసింది. మ్యూజిక్ చార్ట్స్ లో నెంబర్ వన్ ప్లేస్ లో ట్రెండ్ అవుతూ తన సత్తా చాటుతోంది. కేవలం వ్యూస్ మాత్రమే కాకుండా 8 లక్షలకు పైగా లైక్స్ కూడా ఈ పాటకు రావడం విశేషం.



## ఆగ్రహం.. జూమ్!

- మా శరీరాలేనా మీ పెట్టుబడి
- జూమ్ చేసి వీడియోలు, ఫొటోలు
- మండిపడుతున్న యంగ్ హీరోయిన్స్

సినిమా సెలబ్రిటీలు పబ్లిక్ ఫిగర్స్ కాబట్టి బయట ఎక్కడ కనిపించినా సరే అభిమానులు , సామాన్య ప్రజలు వారితో కరచాలనం చేయాలని, మాట్లాడాలని, సెల్ఫీ దిగాలని ఇలా ఏవేవో ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అయితే ఇక్కడ కొంతమంది ఆకతాయిలు మాత్రం కెమెరాలతో జూమ్ చేసి మరీ ఫోటోలు తీస్తుండడంతో యంగ్ బ్యూటీస్ ఇప్పుడు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శరీర భాగాలను జూమ్ చేసి మరీ ఫోటోలు తీస్తున్నారంటూ.. ఈ క్రమంలోనే ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో మరో ఉద్యమం మొదలైందా అనే కామెంట్లు వ్యక్తం అవుతున్నాయి. కన్నడ బ్యూటీలైన సప్తమి గౌడ, ఆశికా రంగనాథ్, రుక్మిణీ వసంత్ తాజాగా తమ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పెట్టిన పోస్టులు ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సినిమా, పబ్లిక్ ఈవెంట్స్ కి హాజరయ్యే హీరోయిన్స్ , నటీమణులను అభ్యంతరకర రీతిలో ఫోటోలు తీయడం ఎంత ...గాదయోగ్యం కాదని కథానాయికులు మండిపడుతున్నారు. జూమ్ చేసి మరీ తమ శరీరాలను ...యాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టులు కూడా పంచుకుంటూ ఉండటంతో ఈ విషయం కాస్త హాట్ టాపిక్‌గా మారింది.

### ఆకతాయిల ఆగడాలను అరికడతారా?

ఇన్ని రోజులు సినిమా ఇండస్ట్రీలో లైంగిక వేధింపులు ఉన్నాయని, అవకాశాలు రావాలి అంటే సినిమా నిర్మాతలు, దర్శకులు, హీరోలు చెప్పినట్టు చేయాలి అనే వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో.. మరొకవైపు ఇలా ప్రత్యేకించి కన్నడ బ్యూటీలు సినిమా ఈవెంట్‌లో పాల్గొన్నప్పుడు లేదా బహిరంగ ఈవెంట్లలో పాల్గొన్నప్పుడు తమ శరీర భాగాలను జూమ్ చేసి మరి ఫోటోలు తీస్తున్నారంటూ వాపోడం హాట్ టాపిక్ మారింది. మరి ఈ విషయంపై ఇండస్ట్రీ పెద్దలు, అధికారులు ఏదైనా నిర్ణయం తీసుకుంటారేమో చూడాలి.



## మరోసారి.. మామ్!

- శ్రీదేవి సినిమా రీమేక్
- హీరోయిన్‌గా ఖుషి కపూర్
- తొమ్మిదేళ్ల క్రితం వచ్చిన సినిమాకు మళ్లీ క్రేజ్

దాదాపు తొమ్మిదేళ్ల క్రితం రిలీజైన మామ్ మూవీ బాలీవుడ్‌లో భావోద్వేగ ప్రధాన చిత్రంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా శ్రీదేవి తన కెరీర్‌లో అత్యంత ప్రశంసలు అందుకున్న ప్రదర్శనగా ఈ సినిమా నిలిచింది. ఇప్పుడదే సినిమాకి సీక్వెల్ రూపంలో మామ్2 సెట్స్‌పైకి రావడంతో, ఫ్రాంచైజ్‌పై మళ్లీ ఆసక్తి పెరిగింది. అయితే ఈసారి ఫోకస్ పూర్తిగా కొత్త తరం వైపు మళ్లింది. లవ్ యాపా సినిమాలోని యాక్టింగ్ కు విమర్శలు

మామ్2లో మెయిన్ లీడ్ గా శ్రీదేవి చిన్న కూతురు ఖుషీ కపూర్ కనిపించనుంది. ఇప్పటికే బాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమెకు ఇది అత్యంత కీలకమైన ప్రాజెక్ట్‌గా భావిస్తున్నారు. మామ్2 ఆమె కెరీర్‌కు నిజమైన టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్న చర్చ మొదలైంది. భావోద్వేగంతో పాటు బలమైన న్యాయపరమైన కథనం ఉండే ఈ ఫ్రాంచైజ్‌లో ఆమె పెర్ఫార్మెన్స్ ఆడియన్స్ అంచనాలను అందుకోగలదా అన్నది ఆసక్తికరంగా మారింది.





## ఆ సంద్రంలో సయ్యాటలు!

సరికొత్తగా తూనీగ హీరోయిన్ సోషల్ మీడియాలో గ్లామర్ షో

బాలీవుడ్ భామ రియా చక్రవర్తి సోషల్ మీడియాలో ఇటీవల బిజీగా గడుపుతోంది. తాజాగా ఈ యువనటి షేర్ చేసిన వీడియోలో సముద్రపు ఇసుకలో సరదాగా సందడి చేస్తూ కనిపించింది. ముఖ్యంగా బాడీ హగింగ్ ఇన్నర్ వేర్‌లో రియా కనిపిస్తున్న తీరు నెటిజన్ల మతి పోగొడుతోంది. సముద్రపు అలల మధ్య, సూర్యాస్తమయ వేళ తీరిక సమయాన్ని ఆస్వాధిస్తున్న రియా పంచుకున్న ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ యంగ్ బ్యూటీ గ్లామర్ , కాన్ఫిడెన్స్ చూస్తుంటే కుర్రకారు ఫిదా అయిపోతున్నారు. రియాకు సముద్రం అంటే ఎందుకు అంత పిచ్చి? అనే ప్రశ్న మెదులుతోంది. దానికి సమాధానంగా రియా ఒక అందమైన వ్యాఖ్యను ఈ ఫోటోషూట్ కి జోడించింది. గ్రాటిట్యూడ్ అండ్ సన్‌సెట్స్ అంటూ పోస్ట్ పెట్టింది. ప్రకృతి ఒడిలో ముఖ్యంగా సముద్ర తీరాన గడపడం వల్ల కలిగే ప్రశాంతత తనకు ఎంతో ఇష్టం. అందుకే షూటింగ్‌లకు విరామం దొరికినప్పుడల్లా సముద్రపు హోరును వినడానికి అక్కడి ఇసుకలో ఆడుకోవడానికి ప్రాధాన్యతనిస్తుంది. సముద్రం రియాకు కొత్త శక్తిని ఇస్తుందని చెప్పకనే చెబుతోంది. రియా షేర్ చేసిన ఈ వీడియోపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ముఖ్యంగా ఈ భామ ఎంపికచేసుకున్న డిజైనర్ లుక్ ఎంతో కళాత్మకంగా ఉందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఎప్పుడూ క్లాసీగా ఉంటావు బంగారం! అంటూ ఆమె స్టైల్‌ను మెచ్చుకుంటున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) RNI NO. APTEL/2006/18964, : .